సత్యం, సమర్థత, విశ్వసనీయత

WWW.SAKSHYAM.COM

# సాక్ష్యం

తెలుగు దినపత్రిక

సంపుటి: 17 | సంచిక: 169


పేజీలు: 08 | వెల: రూ.2:00

విజయవాడ | గురువారం 18 జూన్ 2026

Published from Vijayawada, Hyderabad.


## సైబర్ నేరస్థులు పరాన్న జీవులు

- ప్రజలను మోసగించే వారు సమాజానికి చేటు
- అలాంటివారు జైల్లో ఉండడమే కరెక్ట్
- సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ,జూన్17(సాక్ష్యం): సైబర్ నేరస్థులు అమాయక ప్రజలను మోసంచేసి కోట్లాది రూపాయలు కాజేసే పరాన్నజీవులని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న వారిపై చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. ఈ మేరకు ఓ సైబర్ ఫ్రాడ్ కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరించి, ఆ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది న్యాయస్థానం. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా.. సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని

మిగతా 2 లో..



## చీలిక దిశగా ఉద్ధవ్ శివసేన

- పార్టీ టిక్కెట్‌పై గెలిచిన వారు రాజీనామా చేయాలి
- ఎంపి సంజయ్ రౌత్ ఘాటు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,జూన్17(సాక్ష్యం): మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే మరోసారి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది. పలువురు ఎంపీలు ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని శివసేనలో చేరనున్నట్లు

మిగతా 2 లో..



## రెండోవిడతలో గుడిసెవాసులకు ప్రాధాన్యం

- 75 వేల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన
- గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్,జూన్17(సాక్ష్యం): ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతలో గుడిసె వాసులకే తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో

మిగతా 2 లో..



## నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు శుభవార్త

- రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా బస్సు ప్రయాణం
- రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

కరీంనగర్,జూన్17(సాక్ష్యం): ఈనెల 21న నిర్వహించే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. విద్యార్థులు

మిగతా 2 లో..

# స్వేచ్ఛా వాణిజ్యం

## హర్మ్యూజ్‌లో ఆంక్షలు ఉండరాదు

- భారత నావికుల రక్షణ మాకు ముఖ్యం
- ఆంక్షలు తొలగించడం ప్రపంచానికి అవసరం
- ట్రంప్‌తో భేటీలో ప్రధాని మోడీ స్పష్టీకరణ
- ప్రధాని మోడీ తనకు మంచి మిత్రుడు
- మరోమారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్య

ప్యారిస్,జూన్17(సాక్ష్యం): హర్మ్యూజ్ జలసంధి వద్ద ఎలాంటి ఆంక్షలు ఉండొద్దని, అక్కడ స్వేచ్ఛా వాణిజ్యం జరగాలని ప్రధాని మోదీ అన్నారు. అక్కడ వేలాది మంది భారత నావికుల భద్రతే తమకు ముఖ్యమని, వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో శాంతి కోసం ట్రంప్ కృషి చేశారని,

మిగతా 5 లో..

### ఇరాన్ యుద్ధంతో ఇంధన సంక్షోభం

- ఇంధన సంక్షోభంలో ప్రపంచ దేశాలు
- ఆర్థికంగా వెనకబడ్డ దేశాలను ఆదుకోవాలి
- జి-7 సైదస్సులో ప్రధాని మోడీ వెల్లడి

ప్యారిస్,జూన్17(సాక్ష్యం): ఫ్రాన్స్‌లోని ఎవియాన్-లే-బేలో బుధవారం జరిగిన జీ-7 కూటమి దేశాల సమావేశంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. జీడీపీ, వాణిజ్య గణాంకాలను దాటి, ఆర్థిక వృద్ధిపై చర్చలు ఉండాలన్నారు. 'అందరికీ సమాన, స్థిర ఆర్థిక వృద్ధి అంశం'పై చర్చ

మిగతా 5 లో..



## కుల వ్యవస్థను నిర్మూలించేందుకే

# ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు

- ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ కాదు
- ఆ భావన నుంచి అంతా బయటపడితే మంచిది
- ఇక్కడే మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం
- సర్కార్ బడుల నుంచే ఐఎఎస్,ఐపిఎస్‌లు వచ్చారు
- అందరికీ విద్య లక్ష్యంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు
- కులమతాలకు అతీతంగా విద్య అందించాలన్న లక్ష్యం
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- ఆరుట్లలో రూ.15 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్
- స్కూల్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అంతర్జాతీయ ప్రమాణాలతో పబ్లిక్ స్కూల్ ఏర్పాటు
- ఆరుట్లలో సరదాగా గడిపిన సీఎం రేంవత్ రెడ్డి
- స్కూల్ విద్యార్థులతో కలసి సీఎం బ్రేక్ ఫాస్ట్..
- ఫుట్ బాల్ ఆడి విద్యార్థుల్లో ఉత్సాహం నింపిన సీఎం


రంగారెడ్డి,జూన్17(సాక్ష్యం): ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరమని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ బడుల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్, సీఎంలు అయినవాళ్లు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ అనే ఆలోచన పోవాలని అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. ఆరుట్లలో రూ. 15 కోట్లతో

మిగతా 2 లో..



### వరంగల్ పర్యటనలో పవన్ కళ్యాణ్

వరంగల్,జూన్17(సాక్ష్యం): ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్ (17)ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించారు.



బుధవారం హనుమకొండ, హనుమాన్ నగర్‌లోని బాలుడి ఇంటికి వెళ్లారు. బాలుడితో కొద్దిసేపు ముచ్చటించారు. నిరంజన్ కుటుంబానికి పవన్ భరోసా ఇచ్చారు. నిరంజన్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష ఆర్థిక సాయం అందించారు. చిన్ననాటి నుంచి మీరంటే ప్రాణం అని చెప్పిన నిరంజన్ మాటలకు పవన్ చలించి పోయారు. నిరంజన్‌ను హత్తుకుని ముద్దాడారు.

మిగతా 5 లో..


## యోగా దినోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా

# మార్చాలి

### 21 యోగా దినోత్సవానికి పటిష్టంగా ఏర్పాట్లు చేయాలి

### అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు సూచన

అమరావతి,జూన్17: అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జూన్ 21న రాష్ట్రవ్యాప్తంగా జరిగే యోగా దినోత్సవ కార్యక్రమాలను సమన్వయంతో, ఘనంగా నిర్వహించేలా అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన 'యోగాంధ్ర-2026' ఏర్పాట్లపై బుధవారం ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యోగా దినోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. యోగా దినోత్సవాన్ని కేవలం కార్యక్రమంగా కాకుండా ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు సూచించారు. శాఖల మధ్య సమన్వయం మరింత బలంగా ఉండాలని, అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్



స్టేడియంలో ఘనంగా నిర్వహించేలా ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రస్థాయి ప్రధాన ఈవెంట్‌గా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో యోగా కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో యోగా ద్వారా ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. అలాగే యోగా ద్వారా ఆరోగ్యకర జీవనశైలి ప్రాముఖ్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆయుష్ శాఖ అధికారులు, అలాగే ప్రకృతి వైద్యం, యోగా సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు పాల్గొన్నారు. వారు యోగా కార్యక్రమాల అమలు, ప్రజల భాగస్వామ్యం పెంపుపై ఈ సమావేశంలో చర్చించారు.

## రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ

# ప్రధాన లక్ష్యం

వారు ఆర్థికంగా ఎదగాలన్న దిశగా కృషి

- పేదలు సన్నబియ్యం తినాలి.. రైతులు ఆర్థికంగా ఎదగాలి
- సన్నరకాలను పండించేలా రైతు కమిషన్ సిఫారసు
- కేబినేట్ సబ్ కమిటీలో చర్చించినట్లు భట్టి వెల్లడి



హైదరాబాద్,జూన్17(సాక్ష్యం): రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ అడుగులు వేయాలని సూచించారు. పేదలు సన్నబియ్యం తినాలని.. రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. సచివాలయంలో భట్టివిక్రమార్క అధ్యక్షతన బుధవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశం అయింది. ఈ భేటీకి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు, నిల్వ సదుపాయాలపై

మిగతా 5 లో..

### సర్‌తో ముస్లిం ఓట్ల తొలగింపు కుట్ర

బెంగాల్, బిహార్‌లే ఇందుకు నిదర్శనం

మీడియాతో మంత్రి అజారుద్దీన్ వ్యాఖ్య



హైదరాబాద్,జూన్17(సాక్ష్యం): 'సర్' ప్రక్రియతో ముస్లింల ఓట్లను తొలగించే అవకాశముందని తెలంగాణ మంత్రి అజారుద్దీన్ షాకింగ్ కామెంట్స్ చేశారు. 'సర్' అందరి అంశమైనా.. ముస్లింల ఓట్లనే టార్గెట్ చేస్తారని ఆరోపించారు. పశ్చిమబెంగాల్, బిహార్‌లో ముస్లింల ఓట్లు తొలగించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. తెలంగాణలోనూ అలాంటి కుట్రలకు పాల్పడే ఛాన్స్ ఉందని ఆరోపించారు. బుధవారం గాంధీభవన్‌లో

మిగతా 5 లో..

# రాష్ట్రంలో సంక్షేమం లేదు.. అంతా సంక్షోభమే

- దండుపాళ్యం బ్యాచ్ రాష్ట్రాన్ని దోచుకుంటోంది
- జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా అభివృద్ధి సున్నా
- ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేసీఆర్ మళ్లీ సీఎం
- సర్‌పై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాల్సిందే
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచన
- పాలేరు నియోజకవర్గ బూత్ కార్యకర్తలతో భేటీ



ఖమ్మం,జూన్17(సాక్ష్యం): రాష్ట్రంలో సంక్షేమం లేదని.. ఎక్కడ చూసినా కూల్చివేతలే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణలో రాక్షస పాలన సాగుతోందని ఆయన విమర్శించారు. దండుపాళ్యం ముఠాకు అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అయితే ఇక్కడ మంత్రులు ఆయనను మించిపోయారంటూ దుయ్యబట్టారు. రెవెన్యూ మంత్రి అవినీతికి హద్దు లేకుండా పోయిందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించారు. పాలేరు నియోజకవర్గం వెంకటగిరిలో బూత్‌లెవల్ కార్యకర్తల శిక్షణా

మిగతా 5 లో..

## నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన

### పెమ్మసానితో కలసి పూజ చేసిన లోకేశ్

### రూ. 142 కోట్ల వ్యయంతో ఆర్వోబీ నిర్మాణం



గుంటూరు,జూన్17: నిడమర్రు రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి మంత్రి నారా లోకేష్ బుధవారం శంకుస్థాపన చేశారు. నంబూరు-మంగళగిరి సెక్షన్ మార్గంలో మంగళగిరి-నిడమర్రు మార్గంలో 14వ నెంబర్ రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు స్థానంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనులకు ఈ ఉదయం మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా మంగళగిరి-నిడమర్రు రోడ్డు వద్దకు చేరుకున్న మంత్రి లోకేష్, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ లకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. మంగళగిరి నుంచి రాజధాని అమరావతికి, తాడికొండ నియోజకవర్గానికి అనుసంధానంగా నిడమర్రు రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద రూ.142 కోట్ల వ్యయంతో ఆర్వోబీని నిర్మించనున్నారు.

# సంపాదకీయం

## విద్యార్థులకు నీట్ కటకటలు !

నీట్ ఏ ముహూర్తాన ప్రవేశ పెట్టారో కానీ ఎప్పుడూ సవ్యంగా సాగడం లేదు. ఈ నెల 21 తిరిగి నీట్ నిర్వహించబోతున్నారు. ఈ క్రమంలో పరీక్షాపత్రం సిద్ధం చేసిన వారిని రహస్య ప్రాంతంలో విడిది చేయించారు. వారికి ఫోన్, టివి లాంటివి అందుబాటులో లేకుండా రహస్యంగానే ఉంచారు. గతంలో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం ఎంసెట్ నిర్వహించుకున్నప్పుడు ఎక్కడా లోపాలు లేవు. సాఫీగా ఎంసెట్ జరిగింది. మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు సాఫీగా సాగాయి. కానీ ఎప్పుడైతే జాతీయ స్థాయిలో నీట్ ప్రవేశ పెట్టాక గందరగోళం, పేపర్ లీక్‌లు సర్వసాధరణంగా మారింది. తాజాగా మరోమారు పేపర్ లీక్ కావడంతో ఈ నెల 21వ తేదీన తిరిగి పరీక్షను నిర్వహించబోతున్నారు. ఇప్పుడు ప్రధాని కార్యాలయం స్వయంగా పర్యవేక్షించడం చూస్తున్నాం. హెలికాప్టర్లు, విమానాలు, సిఆర్‌పిఎఫ్ బలగాల రక్షణలో పరీక్ష నిర్వహించ బోతున్నారు. నిజానికి పరీక్షకు ప్రిపేర్ అయి గతంలోనే రాసిన అనేకమంది ఇప్పుడు తమ భవిష్యత్ ఎలా ఉంటుందో అన్న గందరగోళంలో పడ్డారు. మానసికంగా వారు ఒత్తిడికి గురవుతున్నారు. యూపిపిఎస్సీ పరీక్షను సక్రమంగా నిర్వహిస్తున్నప్పుడు నీట్ పరీక్షను ఎన్‌టిఎ ఎందుకు సరిగా నిర్వహించడం లేదని సుప్రీం కోర్టు గతంలోనే మొట్టి కాయలు వేసింది. నీట్ పరీక్షను పక్కాగా నిర్వహించడంలో విఫలం అయిన ఎన్‌టిఎపై చర్యలు తీసుకోకుండా విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్న తీరు సమస్యగా మారింది. ఇకపోతే 21న పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు నీట్-యూజీ పరీక్ష అడ్మిట్‌కార్డుల డౌన్‌లోడింగ్ ప్రక్రియలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అడ్మిట్‌కార్డులు నీట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఆ పరీక్షను నిర్వహించే 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' (ఎన్‌టీఏ) ఆదివారం ప్రకటించగానే.. విద్యార్థులు భారీ సంఖ్యలో వెబ్‌సైట్‌ను సందర్శించారు. అయితే, పోర్టల్ తెరుచుకోవటానికి చాలా సమయం పడుతోందని, మధ్యలోనే నిలిచిపోతోందని, టైమ్‌ఔట్ ఎర్రర్స్‌ని చూపిస్తోందని అనేక మంది సోషల్ మీడియాలో పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ, పరీక్షకు మళ్లీ సన్నద్ధం కావటంలో ఇప్పటికే తాము తీవ్రమైన మానసిక ఒత్తిడిలో ఉంటే.. ఈ సమస్యలు ఏమిటని అసహనం వ్యక్తం చేశారు. అడ్మిట్‌కార్డుల విషయంలో ఈ పరిస్థితి ఉంటే.. ఫీజు రిఫండ్ అంశంలోనూ సమస్యలు తలెత్తాయని తెలిపారు. రిఫండ్ కోసం తమ బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించిన తర్వాత కూడా.. వివరాలు ఇవ్వలేదంటూ వెబ్‌సైట్‌లో కనిపించిందని పలువురు వెల్లడించారు. మరికొందరు, తమకు తెలియకుండా.. రిఫండ్ అవసరం లేదనే ఆప్షన్‌ను సెలక్ట్ చేశామని, రిఫండ్ కోసం ఈ ఆప్షన్‌ను ఎడిట్ చేసుకునే అవకాశం కల్పించాలని ఎన్‌టీఏకు విజ్ఞప్తులు చేశారు. అడ్మిట్‌కార్డుల కోసం ప్రత్యామ్నాయ విధానాలను కూడా అందుబాటులో ఉంచాలని, బ్యాంకుఖాతాల ధ్రువీకరణ ప్రక్రియను సులభతరం చేయాలని పలువురు ఎన్‌టీఏకు సూచించారు. కాగా, ఈ ఫిర్యాదులపై ఎన్‌టీఏ సోమవారం స్పందిస్తూ.. విద్యార్థులు భారీ సంఖ్యలో సందర్శించటం వల్ల తమ సర్వర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని, వాటిని సరిదిద్దటానికి నిపుణులు పని చేస్తున్నారని పేర్కొంది. ఇప్పటికే 4 లక్షల మంది విద్యార్థులు అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు తెలిపింది. పేపర్ లీకేజీ, తిరిగి పరీక్ష నిర్వహణ నేపథ్యంలో నీట్ విద్యార్థులకు ఫీజును రిఫండ్ చేస్తామని ఎన్‌టీఏ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదే అదునుగా.. ఓ సైబర్ నేరస్థుడు రిఫండ్‌ల మొత్తాన్ని తన ఖాతాకు మళ్లించుకున్నాడు. బిహార్‌లోని గయ జిల్లాకు చెందిన 19 ఏళ్ల నవీన్ యాదవ్ అనే వ్యక్తి నీట్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న 150 మంది విద్యార్థుల అకౌంట్లను హ్యాక్ చేశాడు. రిఫండ్ కోసం ఆయా విద్యార్థులు ఇచ్చిన బ్యాంకు ఖాతాల వివరాల స్థానంలో తన బ్యాంకు ఖాతా వివరాలను నమోదు చేశాడు. తద్వారా ఒక్కో విద్యార్థికి రూ.1700 చొప్పున వచ్చిన రిఫండ్ మొత్తాన్ని తన ఖాతాకు మళ్లించాడు. దీనిపై ఓ విద్యార్థి తండ్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ సైబర్ క్రైం బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేయగా.. అసలు విషయం బయటపడింది. నవీన్ యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు, నీట్ రీఎగ్జామ్ ప్రశ్నపత్రాలను అమ్ముతామంటూ విద్యార్థులు, తల్లిదండ్రులతో బేరసారాలు సాగిస్తున్న రాజస్థాన్‌కు చెందిన సుమేర్‌సింగ్ మీనా, ఆకాశ్‌మీనా అనే ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. టెలిగ్రాం ఛానళ్ల ద్వారా వీరు నీట్ ప్రశ్నపత్రాల గురించి ప్రచారం చేశారని, రూ.1.5 కోట్ల మేర లావాదేవీలు జరిపారని వెల్లడైంది. ఇదిలావుంటే ఈ గందరగోళం నేపథ్యంలో ఒక పరీక్ష నిర్వహణకు ఇంతగా హంగామా ఎందుకని తమిళనాడు బిజెపి మాజీ అధ్యక్షుడు, విశ్రాంత పోలీస్ అధికారి అన్నామలై ప్రశ్నించారు. పోలీసులు, హెలికాప్టర్ల వినియోగం వంటివన్నీ చేయడం, ప్రధాని కార్యాలయం సమీక్షించడం వంటివి వైఫల్యాలను ఎత్తి చూపుతున్నాయని అన్నారు. నీట్ పరీక్ష విషయంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వైఫల్యాలపై సమీక్షించాలి. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అనుసరిస్తున్న తీరుగా పటిష్టం చేయాలి. లేదా నీట్‌ను ఎత్తివేయడం మంచిది.

## సైబర్ నేరస్థులు పరాన్న జీవులు

మొదటిపేజీ తరువాయి..

ధర్మాసనం సైబర్ నేరాలపై పెరుగుతున్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలను ఆకర్షించి భారీ లాభాలొస్తాయని నమ్మబలికి వారిని మోసగించే వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమంది. 'మీరు పరాన్నజీవులు.. పెట్టుబడిదారుల నుంచి డబ్బు తీసుకుని మోసం చేస్తున్నారు. మీలాంటి వారు జైల్లో ఉండటమే సమాజానికి శ్రేయస్కరం. సైబర్ నేరస్థుల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలి. ఇలాంటి నేరాలు ఎప్పుడూ పాన్ ఇండియా స్థాయిలో జరుగుతూ ఉంటాయి. గుజరాత్‌లో ఒకరు, ఆ తర్వాత ముంబై మరొకరి నుంచి.. ఇలా అందరి నుంచి డబ్బులు వసూలు చేస్తారు' అని ధర్మాసనం పేర్కొంది. సందర్భంగా కోర్టుకు అందించిన వివరాలను ప్రస్తావిస్తూ.. గతేడాది చివరి నాటికి దేశంలో డిజిటల్ మోసాల కారణంగా రూ.3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు పేర్కొంది న్యాయస్థానం. సైబర్ నేరాల తీవ్రతను ఇది విస్పష్టంగా తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. కాగా.. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఔఅఖీః) గణాంకాల ప్రకారం.. 2021 నుంచి 2023 మధ్య సుమారు 63 శాతం సైబర్ మోసాలు పెరగడంతో కేసుల సంఖ్య 86 వేల మార్కును దాటింది. వీటిలో కర్ణాటక తొలి స్థానంలో ఉండగా.. తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కృషి

### కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పాయం

భద్రాద్రి కొత్తగూడెం,జూన్17(సాక్ష్యం): గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారంర బూర్గంపహాడ్ మండలంలో పర్యటించిన ఆయన బూర్గంపహాడ్ మండల కేంద్రంలో రూ.65 లక్షల అంచనాతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్డు పనులకు ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు అభివృద్ధికి పాటుపడుతున్నామన్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారుల్లో సీసీ రోడ్లు పూర్తయితే రవాణా సౌకర్యవంతం గా ఉంటుందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని సారపాక వాసవీ ఫంక్షన్‌హాల్‌లో తాసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని 34 మంది లబ్దిదారులకు చెక్కులు అందించడంతో పాటు 25 మందికి రూ.13 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో పీఆర్ డీఈ పొదెం వెంకటేశ్వరరావు, ఏఈ చక్రధరాచారి, సర్పంచులు మందా నాగరాజు, బాదం వెంకటేశ్‌రెడ్డి, పోతినేని సూరమ్మ, సర్పా నాగమణి, లక్ష్మిపురం మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ బట్టా విజయ్ గాంధీ పాల్గొన్నారు.

### కుల వ్యవస్థను నిర్మూలించేందుకే

# ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు

మొదటిపేజీ తరువాయి..

సమూలంగా మార్చగలదన్నారు. విద్య ఖర్చు కాదని.. పెట్టుబడి అని చెప్పుకొచ్చారు. విద్యతో సమాజంలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం వర్గానికొక స్కూల్ పెట్టి కుల వ్యవస్థను ప్రోత్సహించిందని సీఎం విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ కులానికొక స్కూల్ పెట్టారన్నారు. కుల వ్యవస్థను నిర్మూలించేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువస్తే విమర్శలు చేశారని.. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే మెస్సీని తీసుకువచ్చామని తెలిపారు. మెస్సీ.. డ్రగ్స్ ముఠా లీడర్ కాదని, ఆర్థిక నేరగాడు కాదన్నారు. గత ప్రభుత్వం యూనిఫామ్‌లు ఇస్తే.. నెల రోజులకే చిరిగి పోయాయని విమర్శిస్తూ.. ఈ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్ఫూర్తినిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ అడ్మిషన్లు లేవని బోర్డు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఈ విజయానికి అక్కడి ఉపాధ్యాయుల కృషే కారణమని, వారు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. తాను కూడా గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం గుర్తు చేసుకున్నారు. ఆరో తరగతి చదవడానికి రోజూ ఆరు కిలోమీటర్లు నడిచి వెళ్లేవాడినని చెప్పారు. తమ కుటుంబం ఆర్థికంగా బాగానే ఉన్నప్పటికీ చదువుకున్నవారు లేరని, 17 ఏళ్ల వయస్సులోనే రాజకీయాల్లోకి వచ్చానని వివరించారు. దేశ ప్రధానులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు సహా ఎన్నో ప్రముఖులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని ఆయన పేర్కొన్నారు. సమాజంలో కులాల మధ్య గోడలు నిర్మిస్తున్నారని, ఆ గోడలను కూల్చాలనే ఉద్దేశంతో అన్ని వర్గాల పిల్లలు కలిసి చదివేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. విద్య ద్వారా సమానత్వాన్ని పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. 140 కోట్ల జనాభా ఉన్న దేశం ఒలింపిక్స్‌లో ఆశించిన




నాణ్యమైన విద్య అవసరం అన్నారు. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తాం. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే విమర్శలు చేశారు. విద్యాకిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్లతో టెండర్లు పిలిచాం. రూ.680 కోట్ల టెండర్లలో రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని ఒకాయన అంటున్నారు.. ఎలా సాధ్యమో చెప్పాలి. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం' అని సీఎం అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్విద్యా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ విద్యా నమూనా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 25 లక్షల మంది విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యాశాఖ కోసం రూ.8,500 కోట్లను కేటాయించిందని ఆయన వెల్లడించారు. విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఉద్యోగాలు రావన్న అపోహలు పేద ప్రజల్లో ఉన్నాయని, ఆ నమ్మకాన్ని తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేశామని సీఎం వివరించారు. విద్యా కమిషన్ వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలను సందర్శించి రూపొందించిన నివేదిక ఆధారంగానే ఈ కొత్త విద్యా విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన 'దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది' అనే భావనను స్ఫూర్తిగా తీసుకుని విద్యా రంగంలో మార్పులు తీసుకొస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజంలో సమూల మార్పు సాధ్యమవుతుందని, అందుకే విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరారని సీఎం తెలిపారు. భారీగా దరఖాస్తులు రావడంతో స్థాయిలో పతకాలు సాధించలేకపోతోందని అన్నారు. ఇటీవల దక్షిణ కొరియాను సందర్శించి అక్కడి క్రీడా విధానాలను అధ్యయనం చేశానని చెప్పారు. 2034 నాటికి తెలంగాణ నుంచి ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించే క్రీడాకారులను తయారుచేయాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రాజకీయ స్వార్థంతో కొందరు అభివృద్ధి కార్యక్రమాలను కూడా వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన స్కూల్ కిట్లు అందించేందుకు పారదర్శకంగా టెండర్లు నిర్వహించినప్పటికీ.. కొందరు అవినీతి ఆరోపణలు చేస్తున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. ఉన్నత విద్యావంతులు కూడా వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని సీఎం తెలిపారు. ఈ నెల 19న హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో గవర్నర్ సమక్షంలో డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా భారీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులతో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలతో మాట్లాడారు. ప్రీ-ప్రైమరీ విభాగాలను సందర్శించారు. పాఠశాల లైబ్రరీ, తరగతి గదులు, ఇన్నోవేషన్ ల్యాబ్, ఫిజిక్స్, బాటనీ, కెమిస్ట్రీ ల్యాబ్స్‌ను సందర్శించిన సీఎం.. అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఆవరణలో సీఎం మొక్క నాటారు. డ్యాన్స్, మ్యూజిక్ రూమ్‌ను సందర్శించారు. ఫుట్‌బాల్ గ్రౌండ్‌ను సందర్శించి విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. కిచెన్‌ను సందర్శించి పూరీలు చేశారు. మొత్తంగా సరదాగా గడిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆరుట్లలో బహిరంగ సభను ఏర్పాటు చేయగా.. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## మైనర్ బాలికపై అత్యాచారం, హత్య

### పోక్సో కేసులో 20ఏళ్లు...హత్య కేసులో యావజ్జీవం

### నిందితుడికి శిక్ష విధించిన సిరిసిల్ల పోక్సో కోర్టు

రాజన్నసిరిసిల్ల,జూన్17(సాక్ష్యం): మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన పోక్సో కేసుతోపాటు, అదే బాలికను హత్య చేసిన కేసులో నిందితుడు బండపల్లి నవీన్ కుమార్



(27)కు పోక్సో కేసులో 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ సిరిసిల్ల పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ బుధవారం సంచలన తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కోడిమ్యాల మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన బండపల్లి నవీన్ కుమార్‌కు చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలికతో పరిచయం ఏర్పడింది. 2019 మార్చి 13న బాలికను అపహరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేయడంతో చందుర్తి పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించి నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు. అనంతరం 2020 డిసెంబర్ 4న నిందితుడు బాలికను ఆమె ఇంటి నుంచి అపహరించి గ్రామ శివారుకు తీసుకెళ్లాడు. అక్కడ అత్యాచారం చేసిన అనంతరం జరిగిన విషయాన్ని బయటపెడుతుందనే భయంతో బాలికకు విషం తాగించి హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. తీవ్ర అస్వస్థతకు గురైన బాలికను నిందితుడు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ చికిత్స పొందుతూ మృతి చెందింది. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీసులు హత్య, అత్యాచారం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాక్షుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు, ఇతర శాస్త్రీయ ఆధారాలను సేకరించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ రెండు కేసులు సిరిసిల్ల పోక్సో ప్రత్యేక కోర్టులో విచారణకు వచ్చాయి. విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ తరఫున సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితుడిపై నేరాలు రుజువైనట్లు నిర్ధారించింది. దీంతో పోక్సో కేసులో 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.7,000 జరిమానా, హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసుల్లో నిందితుడికి శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు నిర్వహించిన అప్పటి డీఎస్పీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, కోర్టు కానిస్టేబుళ్లు మహేందర్, లతీఫ్, నవీన్, వెన్నెలను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అభినందించారు.

## ఉస్మానియా డెంటల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం

### జూనియర్ విద్యార్థులతో వెట్టి చేయించిన సీనియర్లు

### 12మంది సీనియర్ విద్యార్థులను సస్పెండ్ చేసిన ప్రిన్సిపాల్

హైదరాబాద్,జూన్17(సాక్ష్యం): హైదరాబాద్ నగరంలోని ఉస్మానియా డెంటల్ కాలేజీలో ర్యాగింగ్ ఉదంతం కలకలం రేపింది. దీనిపై సుల్తాన్ బజార్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ర్యాగింగ్‌కు పాల్పడ్డ పలువురు విద్యార్థులను ఆరునెఉలలపాటు బహిష్కరించినట్లు ప్రిన్సిపల్ సర్జీవ్ సింగ్ యాదవ్ వెల్లడించారు. జూన్ తొమ్మిదో తేదీన కాలేజీలో ప్రథమ సంవత్సరం చదువుతున్న బీడీఎస్ విద్యార్థులు తమపై సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారంటూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన కాలేజీ యాజమాన్యం, ఆ రోజే సదరు ఫైల్ ఇయర్ విద్యార్థులను పిలిపించి గట్టిగా మందలించింది. అయితే, యాజమాన్యం హెచ్చరించిన 24 గంటలు తిరగకముందే సీనియర్ విద్యార్థులు మరోసారి ర్యాంకింగ్‌కు పాల్పడ్డారు. నిబంధనలను ఉల్లంఘించి ర్యాగింగ్‌కు పాల్పడిన మొత్తం 12 మంది విద్యార్థులను



కాలేజీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సర్జీవ్ సింగ్ యాదవ్ మాట్లాడుతూ.. 'జూనియర్లతో సీనియర్లు ఆల్కహాల్, సిగరెట్లు తెప్పించడంతో పాటూ కూలర్లలో నీళ్లు నింపడం వంటి పనులు చేయిస్తూ వేధించేవారు. ర్యాగింగ్ భయంతో మూడో సంవత్సరం చదువుతున్న కొందరు బాధితులు హాస్టల్ గదుల నుంచి బయటకు రావడానికి కూడా భయపడిపోయారు. ర్యాగింగ్‌కు పాల్పడిన థర్డ్ ఇయర్ విద్యార్థులపై గతంలోనూ ఎన్నో ఫిర్యాదులు వచ్చాయి. గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన హాస్టల్లోని సీసీ కెమెరాలను పగలగొట్టడమే కాకుండా, ఇతర విద్యార్థులను కూడా తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. ఆ సమయంలో వారిపై చర్యలు తీసుకోవడానికి సిద్ధమవ్వగా, సదరు విద్యార్థులు యాజమాన్యానికి క్షమాపణలు చెప్పి, మరోసారి ఇలాంటి తప్పులు చేయబోమని నమ్మించారు. కానీ, వాళ్ల బుద్ధి మారలేదు.. మరోసారి అదే తరహా ప్రవర్తనతో జూనియర్లను వేధించారు. ఈ క్రమంలోనే 12 మంది విద్యార్థులను సస్పెండ్ చేశాం అని తెలిపారు. అలా చేయడం వల్ల పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల బాధ్యత కూడా ఎంతో ఉంటుందని కాలేజ్ యాజమాన్యం అభిప్రాయం అని అన్నారు. ఇది వారికి గుణపాఠం కావాలన్నారు. అలాగే మిగతా వారికి ఓ హెచ్చరిక అన్నారు. ఇదిలావుంటే ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకిదిగారు.

## నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు శుభవార్త

మొదటిపేజీ తరువాయి..

హాల్‌టిక్కెట్ చూపించి ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చన్నారు. రవాణా కోసం విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. బుధవారం మంత్రులు లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ మానకొండూరు మండలం తిమ్మాపూర్ నుంచి కరీంనగర్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో ఉద్యోగాల సంఖ్య



పెంచామని, ఆర్టీసీ కార్మికులకు అన్ని వసతులు కల్పించే విధంగా కృషి చేస్తున్నామని మంత్రి పొన్నం వివరించారు. ఆర్థికంగా మహిళలను బలోపేతం చేసేందుకు ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశామని గుర్తు చేశారు. ఆర్టీసీలో మరిన్ని సేవలను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈనెల 21న జరిగే నీట్ పరీక్షలకు ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు.

## రెండోవిడతలో గుడిసెవాసులకు ప్రాధాన్యం

మొదటిపేజీ తరువాయి..

ఇందిరమ్మ ఇళ్లపై గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామన్నారు. అర్హుల ఎంపిక పూర్తి పారదర్శకతతో చేపడతామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేయని గుడిసె వాసులకు మరో అవకాశం ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. రెండో విడతలో 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 2 వేల ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు నిర్మిస్తామని.. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని పేర్కొన్నారు.
ప్రమాదకర ఇంటి పైకప్పుల మార్పునకు రూ. 2 లక్షల వరకు సాయం అందిస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. అసంపూర్తిగా వదిలిన ఇళ్లను కూడా ఈ పథకంలో ప్రభుత్వం చేర్చనుందన్నారు. లబ్దిదారుడే ఇంటి నిర్మాణదారడని తెలిపారు. బీఎల్‌సీ విధానంలో నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. పట్టణాల్లో అవసరమైతే జీ ప్లస్ 1 నిర్మాణాలకు అనుమతి ఇస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వివరించారు.

## చీలిక దిశగా ఉద్ధవ్ శివసేన

మొదటిపేజీ తరువాయి..

వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశానికి ముగ్గురు ఎంపీలు మాత్రమే హాజరయ్యారు. ఈ సందర్భంగా రెబల్స్‌ను ఉద్దేశించి రౌత్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన మాటలను బీప్ చేయొద్దని పాత్రికేయులకు సూచించడం గమనార్హం. ద్రోహులు వెళ్లిపోవాలి. అసమ్మతివాదులు మొదట రాజీనామా చేయాలి. పార్టీ టికెట్‌పై గెలిచినవారికి ప్రజాతీర్పును మోసగించే హక్కు లేదు. పార్టీ మారేందుకు కొందరు ఎంపీలకు రూ.50 కోట్లు ఆఫర్ చేస్తున్నారని తెలుస్తోంది. అయితే మాకు చీలిక గురించి అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు. మీడియాలో చక్కర్లు కొడుతోన్న వార్తలతో ఈ విషయం మా దృష్టికి వచ్చిందని రౌత్ మాట్లాడారు. ఈ పరిణామాల నేపథ్యంలో శివసేన (యూబీటీ) చట్టపరమైన చర్యలు ప్రారంభించిందని చెప్పారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌లో కూడా చీలికలు వచ్చాయి. వీటిని సంజయ్ ప్రస్తావించారు. చీలికలు ఇలా ఉంటే.. ఎన్నికల్లో పోటీపడటంలో అర్థమే లేదన్నారు. 2022 తరహా తిరుగుబాటు మరోసారి జరిగితే మహారాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఆ ఏడాది శివసేన రెండుగా చీలిపోయింది. అప్పటివరకు ఉన్న పార్టీ పేరు, గుర్తు ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలోని చీలిక వర్గానికి దక్కాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని పార్టీ పేరు శివసేన (యూబీటీ)గా మారింది. లోక్‌సభలో శివసేన (యూబీటీ)కి తొమ్మిది మంది ఎంపీలు ఉన్నారు.

Altum Credo Home Finance

**ఆల్టమ్ క్రెడో హోమ్ ఫైనాన్స్ ప్రై.లి.**

**రిజిష్టర్డ్ కార్యాలయం:** ఫ్లోర్ నం.7, కల్పతరు ఇన్ఫినియా, వాక్డేవాడి, శివాజీనగర్, పూణె-411005 మహారాష్ట్ర (ఇండియా).

**అనుబంధం IV స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కోసం)**

దిగువ సంతకందారు **ఆల్టమ్ క్రెడో హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ACHFL)**యొక్క అధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 (**"SARFAESI యాక్ట్, 2002"**) కింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (**ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్**) లోని సెక్షన్ 13(12) తో పాటు రూల్ 3 కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ, కంపెనీ అధీకృత అధికారి నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో క్రింద పేర్కొన్న మొత్తాన్ని చెల్లించాల్సిందిగా రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులకు (సమిష్టిగా **"రుణగ్రహీతలు"** అని పిలుస్తారు) డిమాండ్ నోటీసు(లు) జారీ చేయడం జరిగింది. రుణగ్రహీతలు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, రుణగ్రహీతలకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది, కింద సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని నిబంధన 8తో పాటు చెప్పబడిన చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (4) కింద అతనికి ఇవ్వబడిన అధికారాల ప్రకారం ఇక్కడ వివరించిన ఆస్తిని **సింబాలిక్** స్వాధీనం చేసుకున్నారు. సెక్యూర్డ్ ఆస్తులను రీడీమ్ చేయడానికి, అందుబాటులో ఉన్న సమయం అందిన తర్వాత, చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) యొక్క ముందస్తు పరిశీలనకు రుణగ్రహీతల దృష్టిని ఆహ్వానిస్తున్నాము. ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు సాధారణంగా ప్రజలు ఆస్తితో వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో జరిగే ఏవైనా లావాదేవీలు దానిపై వడ్డీతో కింద పేర్కొన్న మొత్తానికి ACHFL ఛార్జికి లోబడి ఉంటాయి.

| రుణగ్రహీత(లు)/సహ-రుణగ్రహీత(లు) మరియు గ్యారంటర్(లు) పేరు లోన్ అకౌంట్ నం. | డిమాండ్ నోటీసు తేదీ మరియు అమౌంట్ | స్వాధీనతా తేది |
|---|---|---|
| కేతాని శివ (దరఖాస్తుదారు) కేతాని కుమారి (సహ-దరఖాస్తుదారు) LAN : S145202000005 | 4-మార్చి-2026 రూ. 8,56,898 (రూపాయలు ఎనిమిది లక్షల యాభై ఆరు వేల ఎనిమిది వందల తొంభై ఎనిమిది మాత్రమే) ఎన్‌పిఏ: 28-ఫిబ్రవరి-2026 | 15-06-2026 |

**సెక్యూర్డ్ ఆస్తి వివరణ:** ఆంధ్రప్రదేశ్, తూర్పు గోదావరి జిల్లా, కడియం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో, రాజమండ్రి రూరల్ మండలం, శాటిలైట్ సిటీ గ్రామ పంచాయతీ పరిధిలోని మొరంపూడి రెవెన్యూ గ్రామంలో, డోర్ నంబర్ 106-1-161 కి సమీపంలో, ఆర్.ఎస్.నం. 11/1 గల మొత్తం 72.6 చదరపు గజాల 60.70 చదరపు మీటర్లకు సమానమైన విస్తీర్ణం కలిగి ఉండి, అందులో 600 చదరపు అడుగుల ప్లింత్ ఏరియా గల ఆర్‌సిసి భవనం. సరిహద్దులు : **తూర్పు:** రొబ్బి శమంతకమణి ఇల్లు, **పడమర:** పంచాయతీ రోడ్డు, **దక్షిణం:** సత్తిబాబు ఇల్లు, **ఉత్తరం:** చెల్లాయమ్మ స్థలం

**రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులకు చట్టబద్ధమైన నోటీసు**

రుణగ్రహీతలు/సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులను ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు, ఇకపై ఎప్పుడైనా బహిరంగ వేలం/టెండర్ల ద్వారా ఆస్తిని విక్రయించవచ్చు మరియు అందువల్ల దీనిని సెక్యూరిటీ (ఇంటరెస్ట్) ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002లోని నియమం 6,8 & 9 ప్రకారం నోటీసుగా కూడా పరిగణించవచ్చు.

సం/-
అధీకృత అధికారి
తేదీ: 18.06.2026
ప్రదేశం: తూర్పు గోదావరి
ఆల్టమ్ క్రెడో హోమ్ ఫైనాన్స్ ప్రై. లి. (ACHFL)

## బీచ్ షాక్‌లలో బార్ లైసెన్సులకు ఏపీ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

సాక్ష్యం , విశాఖపట్నం

తీర ప్రాంత పర్యాటకాన్ని ప్రోత్సహించడంతో పాటు ఉపాధి అవకాశాలను పెంపొందించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బీచ్ షాక్‌లలో బార్ లైసెన్సుల మంజూరుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ జి.ఓ.ఎం.ఎస్. నెం.363ను బుధవారం జారీ చేసింది. ప్రభుత్వం రూపొందించిన కొత్త మార్గదర్శకాల ప్రకారం తొలి దశలో ప్రయోగాత్మకంగా విశాఖపట్నం, సూర్యలంక బీచ్‌లలో చెరో రెండు బీచ్ షాక్ బార్ లైసెన్సులు మంజూరు చేయనుంది. బీచ్ షాక్‌లలో బీర్, వైన్, రెడీ–టు–డ్రింక్ (ఆర్‌టిడీ) పానీయాల విక్రయానికి మాత్రమే అనుమతి ఉంటుంది. ఐఎంఎఫ్‌ఎల్ లేదా ఇతర మద్యం విక్రయాలకు అనుమతి ఉండదు.

స్టార్ హోటళ్లు, టూరిజం రిసార్టులు, పర్యాటక శాఖలో నమోదైన సంస్థలు మాత్రమే ఈ లైసెన్సులకు అర్హులు. బీచ్ షాక్‌ల నిర్మాణానికి తీర నియంత్రణ మండలి (సీఆర్‌జెడ్) అనుమతితో పాటు పర్యాటక శాఖ, అగ్నిమాపక శాఖ, ఆహార భద్రత తదితర విభాగాల నుంచి అవసరమైన అనుమతులు పొందాల్సి ఉంటుంది. లైసెన్సు పొందిన బీచ్ షాక్‌లలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే మద్యం సేవలు అందించవచ్చు. వార్షిక రిటైల్ ఎక్సైజ్ పన్ను రూ.7.50 లక్షలుగా నిర్ణయించగా, ప్రతి ఏడాది 10 శాతం పెరుగుదల ఉంటుంది. లైసెన్సు గడువు మూడు సంవత్సరాలు ఉంటుంది. రాష్ట్రానికి 975 కిలోమీటర్లకు పైగా విస్తరించిన సముద్ర తీరాన్ని పర్యాటక అభివృద్ధికి వినియోగించుకోవడం, తీర ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించడం, ఆర్థిక కార్యకలాపాలను పెంచడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది

## సమాచార పౌర సంబంధాల శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్‌గా కె. సదారావు బాధ్యతల స్వీకరణ

సాక్ష్యం , విశాఖపట్నం.

సమాచార పౌర సంబంధాల శాఖ జోన్–1 రీజినల్ జాయింట్ డైరెక్టర్‌గా కె. సదారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం విశాఖపట్నం జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా (డీపీఆర్వో) పనిచేస్తున్న ఆయనకు ప్రభుత్వం జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.రీజినల్ జాయింట్ డైరెక్టర్ బాధ్యతలతో పాటు విశాఖ జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారిగా అదనపు బాధ్యతలు కూడా నిర్వహించాలని ఆ శాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ ఆదేశాలు జారీ చేశారు. సదారావు 1991లో పాడేరులో ఏపీఆర్వోగా తన సేవలను ప్రారంభించారు. అనంతరం డివిజనల్ పీఆర్వోగా పలు ప్రాంతాల్లో, విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో పీఆర్వోగా, కృష్ణా మరియు పశ్చిమ గోదావరి జిల్లాల్లో డీపీఆర్వోగా, విజయవాడ నగరంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా, నెల్లూరులో ఉపసంచాలకుడిగా, అలాగే సమాచార పౌర సంబంధాల శాఖ రాష్ట్ర కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ హోదాల్లో పనిచేశారు. ఈ సందర్భంగా సదారావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో సూపరింటెండెంట్ అన్నమ్మతో పాటు కార్యాలయ సిబ్బంది ఇందిర, మోహనరావు, అలీం తదితరులు పాల్గొన్నారు.



## టిడ్కో, పీఎంఏవై గృహాల నిర్మాణాలు వేగవంతం చేయాలి: కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

సాక్ష్యం , విశాఖపట్నం.

టిడ్కో, పీఎంఏవై గృహాల నిర్మాణాలు మరియు మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేసి లబ్ధిదారులకు త్వరితగతిన గృహాలు అందించేలా చర్యలు చేపట్టాలని విశాఖ జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ప్రత్యేక అధికారి ఎం. అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి నిర్వహించిన సమీక్షా



సమావేశంలో గృహ నిర్మాణాల పురోగతిని ఆయన సమీక్షించారు.

పీఎంఏవై–బీఎల్‌సీ, పీఎంఏవై గ్రామీణ్, ఆవాస్ ప్లస్ పథకాల అమలులో జాప్యం కనిపిస్తోందని పేర్కొంటూ హౌసింగ్ కార్పొరేషన్ అధికారుల పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసి, జీవీఎంసీ యంత్రాంగంతో సమన్వయం చేసుకుని పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

జిల్లాలోని 35 టిడ్కో లేఅవుట్లలో 21 లేఅవుట్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో ఆరు లేఅవుట్లలో మౌలిక సదుపాయాల కల్పన అవసరముందని అధికారులు వివరించారు. మిగిలిన లేఅవుట్లలో నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణాలకు సంబంధించిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించుకోవాలని, తదుపరి సమీక్ష నాటికి గణనీయమైన పురోగతి కనిపించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## నంబూరు–మంగళగిరి స్టేషన్ల మధ్య రూ.142 కోట్ల రోడ్ ఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన

సాక్ష్యం , విశాఖపట్నం

గుంటూరు–విజయవాడ రైల్వే మార్గంలోని నంబూరు–మంగళగిరి స్టేషన్ల మధ్య ఉన్న లెవల్ క్రాసింగ్ నెం.14 స్థానంలో నిర్మించనున్న రోడ్ ఓవర్ బ్రిడ్జి



(ఆర్‌ఓబీ) పనులకు బుధవారం శంకుస్థాపన జరిగింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ సుదేశ్నా సేన్, గతి శక్తి యూనిట్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సైమన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. భారతీయ రైల్వే పూర్తిగా నిధులు సమకూర్చనున్న ఈ ఆర్‌ఓబీ నిర్మాణానికి సుమారు రూ.142 కోట్ల వ్యయం అంచనా వేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా రైల్వే గేట్ మూసివేతల వల్ల ఏర్పడే ట్రాఫిక్ సమస్యలు తొలగిపోవడంతో పాటు రహదారి, రైల్వే వినియోగదారుల భద్రత మెరుగుపడనుంది. అమరావతి–మంగళగిరి ప్రాంతంలో రవాణా అనుసంధానం మరింత బలోపేతం కావడంతో పాటు ప్రాంతీయ సామాజిక, ఆర్థికాభివృద్ధికి కూడా ఈ వంతెన దోహదపడనుంది.

# యర్రగొండపాలెంలో టీడీపీ తుఫాన్..?



## వైసీపీ కోటలు బద్దలు, ఎరిక్షన్ బాబు వ్యూహంతో స్థానిక పోరు ఏకపక్షం..!

- బీసీ,యువత,మహిళా శక్తి టీడీపీ వైపే..?
- మేజర్ పంచాయతీ బీసీకి,మండలం ఓసీకి ఫిక్స్..?
- వైసీపీలో ముసలం,27న సీఎం సభతో క్లైమాక్స్..!
- ఎరిక్షన్ బాబు సోషల్ ఇంజనీరింగ్ : అందరికీ సమన్యాయం..!
- విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం టీడీపీ రణతంత్రం..!

**స్థానిక సంస్థల ఎన్నికల సమరానికి యర్రగొండపాలెం నియోజకవర్గం వేదిక కానుంది.అయితే ఈ పోరు మొదలవ్వకముందే టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు వేసిన రాజకీయ ఎత్తుగడలతో వైసీపీ కోటలు కూలిపోతున్నాయి.బీసీ ఓటు బ్యాంకు,యువత,మహిళా శక్తిని పూర్తిగా తనవైపు తిప్పుకునేలా ఎరిక్షన్ బాబు రచిస్తున్న వ్యూహం ప్రత్యర్థి పార్టీకి నిద్రలేని రాత్రులు మిగిల్చుతోంది.**

మార్కాపురం జిల్లా బ్యూరో, సాక్ష్యం:

### వైసీపీలో ముసలం : కీలక నేతలు టీడీపీ వైపు చూపు..:

ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన, ల్యాండ్, సాండ్,వైన్ మాఫియాతో విసిగిపోయిన ఆ పార్టీ క్యాడర్ ఇప్పుడు



ఎరిక్షన్ బాబు నాయకత్వంలో భవిష్యత్తును వెతుక్కుంటోంది.నియోజకవర్గంలో వైసీపీ మూడు ముక్కలైంది.మాజీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి నేతలు ఇప్పటికే ఎరిక్షన్ బాబు తో టచ్‌లో ఉన్నారు.అవినీతి మరక లేని నాయకుడు, 24 గంటలు అందుబాటులో ఉండే ఎరిక్షన్ బాబు తోనే మా ప్రయాణం అని వైసీపీ సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించడం సంచలనం రేపుతోంది.ఈ నెల 27న గిద్దలూరు సీఎం సభలోనే వందలాది కుటుంబాలతో కూడిన భారీ చేరికలు ఉండనున్నట్లు టీడీపీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

### మేజర్ గ్రామ పంచాయతీ బీసీ పరం..!:

యర్రగొండపాలెం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవిని బీసీల్లోని యాదవ,గౌడ, కుమ్మరి సామాజిక వర్గాల్లో ఏదో ఒక బలమైన నేతకు కేటాయించి,నియోజకవర్గంలోని 60% పైగా ఉన్న బీసీలను టీడీపీకి దగ్గర చేసే వ్యూహం.ఇది అమలైతే వైసీపీ పునాదులు కదిలిపోతాయి.

### మండల పరిషత్ ఓసీలకు,ఎస్సీ,ఎస్టీ, మైనారిటీలకు ప్రాధాన్యత..?:

యర్రగొండపాలెం మండల అధ్యక్ష పదవిని ఓసీ వర్గానికి ఇచ్చి,వైస్ ఎంపీపీ,కో–ఆప్షన్ సభ్యుల పదవులను ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ వర్గాలకు కేటాయించడం ద్వారా అన్ని వర్గాల పార్టీ టీడీపీ అనే భావనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లనున్నారు.యువతకు,మహిళలకు పెద్దపీట..డ్వాక్రా సంఘాలను,యువతను ప్రత్యక్షంగా కలుస్తూ ఎరిక్షన్ బాబు చేస్తున్న పర్యటనలు సూపర్ సక్సెస్ అవుతున్నాయి.మహిళా సాధికారత, యువతకు ఉపాధి నినాదంతో ఆయన వేస్తున్న అడుగులు ప్రతి ఇంటిని తాకుతున్నాయి.స్థానిక ఎన్నికల్లో 50% సీట్లు మహిళలకు,యువతకు కేటాయించేలా ప్లాన్ చేస్తున్నారు.

### యర్రగొండపాలెం నియోజకవర్గాన్నికీ ఎరిక్షన్ బాబు సుప్రీం లీడర్ ..!:

అభ్యర్థుల ఎంపిక నుంచి గెలుపు బాధ్యత వరకు మొత్తం గూడూరి ఎరిక్షన్ బాబు కనుసన్నల్లోనే జరుగుతోంది.నా మాటే శాసనం,నా బాటే పార్టీ బాట అన్నట్లుగా ఆయన పనిచేస్తున్నారు.ఆయనకున్న క్లీన్ ఇమేజ్,ప్రజల్లో విపరీతమైన క్రేజ్ టీడీపీకి వరంగా మారింది.

### 27 న గిద్దలూరు వార్ రూమ్‌గా మారనున్న సీఎం సభ..?:

ఈ నెల 27న గిద్దలూరులో జరిగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారీ బహిరంగ సభ యర్రగొండపాలెం రాజకీయానికి టర్నింగ్ పాయింట్ కానుంది. సీఎం సమక్షంలోనే స్థానిక ఎన్నికల అభ్యర్థులను ప్రకటించి,వైసీపీ నుండి వచ్చే వలసల పర్వానికి అధికారికంగా తెరలేపనున్నారు.ఎరిక్షన్ బాబు స్వయంగా సీఎంకు గ్రౌండ్ రిపోర్ట్ ఇచ్చి,గెలుపు వ్యూహాన్ని వివరించనున్నారు.ఎరిక్షన్ బాబు అంటే అభివృద్ధి,నమ్మకం,భరోసా అనే నినాదం ఇప్పుడు ప్రతి గడపలో వినిపిస్తోంది.చంద్రబాబు ఆశీస్సులు,లోకేష్ స్ఫూర్తితో దూసుకుపోతున్న ఎరిక్షన్ బాబు ను ఢీకొట్టే దమ్ము,ధైర్యం ఈ సారి ప్రత్యర్థి పార్టీల్లో కనిపించడం లేదు.అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లోనే కాకుండా 2029 సార్వత్రిక ఎన్నికల్లో కూడా యర్రగొండపాలెం ఎమ్మెల్యేగా గూడూరి ఎరిక్షన్ బాబు గెలుపు ఖాయమని రాజకీయ విశ్లేషకులు సైతం ఘంటాపథంగా చెబుతుండటం గమనార్హం.

## సింగపూర్ నమూనాలతో అమరావతి అభివృద్ధికి ఏపీ సన్నాహాలు

### పట్టణాభివృద్ధి, వ్యర్థాల నిర్వహణలో అంతర్జాతీయ ఉత్తమ పద్ధతుల అధ్యయనం

సాక్ష్యం , విశాఖపట్నం.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి (ఎంఏ&యూడీ) శాఖ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం సింగపూర్‌లో పర్యటించి ప్రపంచ స్థాయి పట్టణాభివృద్ధి నమూనాలు, సుస్థిర మౌలిక సదుపాయాలు, శాస్త్రీయ ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను అధ్యయనం చేసింది.

ఈ బృందంలో మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్, ఏపీసీఆర్‌డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఐఏఎస్ పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌కు చెందిన ఎన్‌యూఎస్ సిటీస్, సుర్బానా జురాంగ్ ఇన్నోవేషన్ హబ్, టువాస్ సౌత్ ఇన్సినరేషన్ ప్లాంట్‌లను సందర్శించి వివిధ అంశాలపై అధ్యయనం చేశారు. ఎన్‌యూఎస్ సిటీస్‌తో జరిగిన సమావేశాల్లో అమరావతి నగర అభివృద్ధికి సంబంధించి పట్టణ ప్రణాళిక, నగర రూపకల్పన, వాతావరణ మార్పులను ఎదుర్కొనే వ్యవస్థలు, డేటా ఆధారిత నగర పాలన, సామర్థ్యాభివృద్ధి వంటి అంశాలపై భాగస్వామ్య అవకాశాలను పరిశీలించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అమరావతిని జ్ఞానాధారిత, వాతావరణ అనుకూల, ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దే దిశగా చర్చలు జరిగాయి. సుర్బానా జురాంగ్ ఇన్నోవేషన్ హబ్‌లో స్మార్ట్ భవనాలు, ఇంధన సామర్థ్య సాంకేతికతలు, హరిత నిర్మాణ విధానాలు, సాంకేతిక ఆధారిత మౌలిక సదుపాయాల నిర్వహణపై అధ్యయనం చేశారు. అమరావతి, పట్టణ పునరాభివృద్ధి ప్రాజెక్టులు, ప్రజా భవనాల నిర్మాణానికి ఈ అనుభవాలు ఉపయోగపడతాయని అధికారులు పేర్కొన్నారు. టువాస్ సౌత్ ఇన్సినరేషన్ ప్లాంట్ సందర్శనలో వ్యర్థాల సేకరణ, దహనం, విద్యుత్ ఉత్పత్తి, బూడిద నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ చర్యలపై అధ్యయనం చేశారు. రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడంలో ఈ అనుభవాలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు.

మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో పరిశుభ్రమైన, హరిత, సుస్థిర నగరాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.



సింగపూర్ అనుభవాలను అధ్యయనం చేసి రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ మాట్లాడుతూ, అమరావతి అభివృద్ధిలో ప్రపంచ ఉత్తమ పద్ధతులను అమలు చేసేందుకు ఈ పర్యటన ఉపయోగపడిందన్నారు. డిజిటల్ ట్విన్స్, అర్బన్ అబ్జర్వేటరీలు, క్లైమేట్ రెసిలియన్స్ ఫ్రేమ్‌వర్క్‌లు వంటి ఆధునిక విధానాలను రాష్ట్రంలో ప్రవేశపెట్టే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

## యోగాంధ్ర ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

సాక్ష్యం , విశాఖపట్నం.

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. యోగాంధ్ర విజయవంతం కోసం తీసుకుంటున్న చర్యలు, జిల్లా స్థాయిలో జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 20న ఉండవల్లి గుహల సమీపంలో నిర్వహించే యోగా కార్యక్రమంలో ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్‌తో కలిసి ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. అనంతరం జూన్ 21న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి ప్రధాన యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఐదు వేల నుంచి ఆరు వేల మంది వరకు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే



యోగాంధ్ర కార్యక్రమాలకు హాజరయ్యే ప్రజలకు తాగునీరు, వైద్య సేవలు, పారిశుధ్య సదుపాయాలు, రవాణా తదితర అన్ని అవసరమైన ఏర్పాట్లు కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. యోగా ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించి, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంజీవని కార్యక్రమంతో యోగాను అనుసంధానం చేసి ఇంటింటికీ తీసుకువెళ్లేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. ఆరోగ్య పరిరక్షణలో యోగా ప్రాముఖ్యతను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా యోగాంధ్ర కార్యక్రమాన్ని విస్తృత స్థాయిలో నిర్వహించాలని ఆయన అన్నారు. యోగాంధ్రను ప్రజారోగ్య ఉద్యమంగా తీర్చిదిద్దడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రజాభాగస్వామ్యంతో విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

## రిసార్ట్‌గా రుషికొండ ప్యాలెస్.. ప్రజల సందర్శనకూ అవకాశం

సాక్ష్యం ,విశాఖపట్నం.

విశాఖపట్నంలో వివాదాస్పదంగా నిర్మించిన రుషికొండ భవన సముదాయాన్ని (ప్యాలెస్) అంతర్జాతీయ స్థాయి లగ్జరీ రిసార్ట్‌గా అభివృద్ధి చేసి ప్రజల సందర్శనార్థం వినియోగించాలనే ప్రాథమిక నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ వచ్చినట్లు ప్రకటించింది. ప్రజాధనం వృథా కాకుండా పబ్లిక్–ప్రైవేట్



పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో ఈ భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని కమిటీ అభిప్రాయపడింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామిలతో కూడిన కమిటీ బుధవారం రుషికొండ భవనాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ప్యాలెస్‌లోని వివిధ బ్లాక్‌లు, గదులు, అంతర్గత నిర్మాణాలు, విలాసవంతమైన సదుపాయాలను పరిశీలించిన అనంతరం యాత్రినివాస్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రూ.450 కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ఈ భవనాలను కూల్చివేయడం సమంజసం కాదని, ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా వినియోగించడమే సరైన మార్గమని పేర్కొన్నారు. రుషికొండ ప్రాంతానికి విశాఖ ప్రజలతో ఉన్న అనుబంధాన్ని దృష్టిలో ఉంచుకుని ఒక బ్లాక్‌ను కల్చరల్ లేదా హెరిటేజ్ సెంటర్‌గా ప్రజల సందర్శనకు అందుబాటులో ఉంచే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ చదరపు అడుగుకు రూ.6,450 వరకు ఖర్చు చేసి నిర్మాణాలు చేపట్టడం ప్రజాధన దుర్వినియోగానికి నిదర్శనమన్నారు. గతంలో ఏటా రూ.7.5 కోట్ల ఆదాయం తెచ్చిన హరిత రిసార్ట్స్‌ను కూల్చివేయడం వల్ల పర్యాటక శాఖ నష్టపోయిందన్నారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ప్రజాధనంతో నిర్మించిన ఈ భవనాలను ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా వినియోగిస్తామని తెలిపారు. అదేవిధంగా తాజ్, లీలా, ఎట్మాస్ఫియర్ కోర్ తదితర ప్రముఖ సంస్థలు రిసార్ట్ నిర్వహణపై ఆసక్తి వ్యక్తం చేసినట్లు మంత్రులు వెల్లడించారు. ఆసక్తి గల సంస్థల నుంచి ప్రతిపాదనలు స్వీకరించి, అర్హతలను పరిశీలించిన అనంతరం సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగే కేబినెట్‌కు సమర్పించనున్నట్లు తెలిపారు. రుషికొండ భవనాల భవిష్యత్ వినియోగంపై తుది నిర్ణయం రాష్ట్ర మంత్రివర్గమే తీసుకోనుంది.

## ఘనంగా ఎమ్మెల్యే పద్మావతి జన్మదిన వేడుకలు

కోదాడ జూన్ 17( సాక్ష్యం)



ఎమ్మెల్యే పద్మావతి జన్మదిన వేడుకలు బుధవారం తెలంగాణ – ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతం రామాపురం క్రాస్ రోడ్డులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లబండగూడెం సర్పంచ్ అల్సకాని భవాని శరభేశ్వరరావు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యే పద్మావతి మరెన్నో పుట్టిన రోజులు జరుపుకో వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుశీల బెంజిమెన్, మాజీ సర్పంచ్ రంగారావు, గ్రామ శాఖ అధ్యక్షుడు ముత్తయ్య, తదితరులు సుధాకర్ , బాబు ,జయరాజు వార్డు నెంబర్లు, శివరామకృష్ణ ,లింగయ్య ,రమేష్ నాగార్జున ఆదినారాయణ శీను, గురవయ్య, వెంకటేశ్వర్లురామారావు,నాయకులు పాల్గొన్నారు.

## ఆదివాసుల ఆత్మగౌరానికి భంగం

### రాళ్లకుంట చెరువులో భూకబ్జా కలకలం

ఏటూరునాగారం, జూన్ 17, (సాక్ష్యం) :

ఏటూరు నాగారం మండలం ఆకులవారి ఘనపురం గిరిజన సహకార సంస్థ ఎదురుగానున్న రాళ్ల కుంట చెరువు శివారు సర్వే నెం. 209లో భూకబ్జాలు, భూములను ఆక్రమిస్తున్నారని ఆరోపణల పై స్థానిక గిరిజనులు కబ్జాదారుల పేర్లు బయటపెట్టి వారి పై చర్యలు తీసుకోవాలని పత్రికా ముఖంగా బుధవారం కోరారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం ఆకులవారి గణపురంలోని రాళ్లకుంట చెరువు సర్వే నెంబర్ 209 భూకబ్జాలకు పాల్పడుతున్న స్థానికేతర గిరిజనులు శమంతక మణి, స్వాతీలు కలిసి భద్రాచలం, మణుగూర్, వాజేడు, నూగురు వెంకటాపురం కు చెందిన గిరిజనులతో ఏటూరునాగారంలో స్థానికంగా ఉంటున్న బొల్లెం సారయ్య, పెనక నాగమణి, బడే సులోచనలతో కలిసి చట్టం ఆదివాసీలకు కల్పించిన హక్కులను అడ్డుపెట్టుకుని భూకబ్జాలకు పాల్పడుతూ పూర్వం నుండి కుటుంబ సభ్యుల వలె కలిసి ఉన్న మా ప్రాంతంలోని గిరిజన, గిరిజనేతరుల మధ్య చిచ్చు పెడుతున్నారని స్థానిక గిరిజనులు మండిపడ్డారు. "కొందరి చర్యలతో మొత్తం జాతికే చెడ్డపేరు వస్తోందని స్థానిక గిరిజనుల ఆవేదన. రెవెన్యూ, అటవీ శాఖ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానిక గిరిజన సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ భూకబ్జాలకు బడే సులోచన, శమంతకమణి, స్వాతీ, పెనక నాగమణి అనే వ్యక్తులు ప్రధాన పాత్ర



పోషిస్తున్నారని గిరిజనుడు గండేపల్లి సత్యం ఆరోపించారు. వీరు ఆదివాసుల పేరు చెప్పుకొని చట్టవిరుద్ధంగా భూములను కబ్జా చేస్తున్నారని ఆయన విమర్శించారు. గిరిజనుల ఇలాంటి చర్యల వల్ల నిజమైన ఆదివాసుల జాతి మీద ఇతరులకు నమ్మకం పోతోందని గిరిజనుల ఆత్మగౌరవాన్ని మంటగలుపుతున్నారని, ఆదివాసీలు అంటే చట్టాన్ని గౌరవించే వారు, ప్రకృతిని కాపాడే వారు కానీ కొందరి స్వార్థం వల్ల మొత్తం జాతికే చెడ్డ పేరు వస్తోందని సత్యం ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే నెంబర్ 209లో జరుగుతున్న అక్రమాలపై రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. చెరువు శివారు భూములను, ప్రభుత్వ భూములను కాపాడాలని, కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో స్థానిక ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

**స్థానికుల స్పందన:**

రాళ్లకుంట చెరువు చుట్టుపక్కల భూములను ఆక్రమించడం వల్ల వర్షాకాలంలో చెరువుకు ప్రమాదం ఏర్పడుతుందని, భూగర్భ జలాలు కూడా దెబ్బతింటాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే సర్వే నిర్వహించి వాస్తవాలను బయటపెట్టాలని కోరుతున్నారు. ఈ రాళ్లకుంట చెరువు మన తాతల కాలం నుంచి మన బతుకుదెరువు ఈ నేల మీద మన హక్కును ఎవరూ కాలరాయలేరని, ఆదివాసులం అని చెప్పుకుంటూ, అదే జాతి పరువు తీసే పనులు చేస్తున్నారు కొందరు. ఇది మన జాతికే అవమానం. వినండి ఆదివాసుల ఆత్మగౌరవానికి భంగం కలిగేలా, మన ఏటూరు నాగారం పరువు తీసేలా ఎవరైనా ప్రవర్తిస్తే ఊరుకునేది లేదని, చెరువు భూమి జోలికొస్తే, చట్టాన్ని చేతిలోకి తీసుకోకుండానే చట్టంతోనే బుద్ధి చెబుతాం. ఇది నా మాట కాదు ఈ నేల మీద పుట్టిన ప్రతి ఆదివాసీ బిడ్డ శపథం!" ఈ నెల పై గిరిజనులు గిరిజనేతరులు కొన్ని వందల సంవత్సరాల నుంచి అన్నదమ్ముల కలిసి ఉంటున్నాము దయచేసి మా మధ్య గొడవలు పెట్టవద్దు అని ఆమె వేడుకున్నారు. భూ కబ్జాలకు పాల్పడే వ్యవహారంలో కీలక పాత్ర పోషిస్తున్న మండలంలోని ఆకులవారి గణపురంకు చెందిన బొల్లెం సారయ్య అనే గిరిజనుడి సాగు భూమిలో స్థానిక గిరిజనులు, గిరిజనేతర్లు ఇళ్ల స్థలాలకై హద్దులు వేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. రాళ్ళకుంట చెరువు శివార్లో భూకబ్జాలకు పాల్పడిన గిరిజనుల వెనకాల బొల్లెం సారయ్య పాత్ర ఉందని అతను సాగు చేసుకుంటున్న భూమి కూడా ఓ దళితుడి వద్ద కబ్జా చేసిందేనని ఈ సమస్య పరిష్కారం కావాలంటే సారయ్య కబ్జా చేసిన భూమిలో హద్దులు వేశామని స్థానిక గిరిజనులు, గిరిజనేతరులు ముక్త ఖంఠంతో తేల్చి చెప్పారు.

# స్వేచ్ఛా వాణిజ్యం



మొదటిపేజీ తరువాయి..

హర్మూజ్ తెరవడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు జరిగిందన్నారు. ఇరు దేశాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొనేందుకు కృషి చేసినందుకు అధ్యక్షుడు ట్రంప్‌నకు మోడీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఇరువురి నేతల మధ్య కీలక సంభాషణ జరిగింది. ట్రంప్‌తో ప్రధాని మోడీ ఇలా అన్నారు.. 'ప్రపంచానికి హోర్ముజ్‌ను తెరవడం అత్యవసరం. సముద్రయాన స్వేచ్ఛను కచ్చితంగా కాపాడాలని.. దానిపై మనం ప్రత్యేక దృష్టి సారించాలని మేము ఎప్పుడూ చెబుతూనే ఉన్నాం. సముద్ర వాణిజ్య రంగంలో లక్షలాది మంది భారతీయ నావికులు ప్రపంచవ్యాప్తంగా వివిధ సముద్రాల్లో విధుల్లో ఉన్నారు. ఇది చాలా ముఖ్యమని నేను భావిస్తున్నాను? ఒప్పందంలో నావికుల భద్రతకు భరోసా లభిస్తుందని.. వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని నాకు నమ్మకం ఉందని అన్నారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. 'ఫ్రాన్స్‌లో మాకు కొన్ని అద్భుతమైన సమావేశాలు జరిగాయి. ముఖ్యంగా భారత ప్రధాని మోడీతో చాలా మంచి చర్చలు జరిగాయి. మేము వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాం. అమెరికా-భారతదేశం మధ్య చాలా విషయాలు జరుగుతున్నాయి. అమెరికా అత్యుత్తమ స్థితిలో ఉంది. మా ఆర్థిక వ్యవస్థ 19.2 ట్రిలియన్ డాలర్లకు పైగా స్థాయికి చేరుకుంది. మేము కర్మాగారాలను, మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నాం. ప్రధాని మోడీ అమెరికాలో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. అక్కడ చాలా ఖర్చు చేస్తున్నారు. ఆ కృషిని మేము అభినందిస్తున్నాం. మోడీ నాకు చాలా కాలంగా మిత్రుడు. మా మధ్య ఎప్పుడూ గొప్ప సంబంధం ఉంది. మీతో కలిసి ఉండటం చాలా సంతోషంగా ఉందని ట్రంప్ పేర్కొన్నారు. నాకు భారతదేశం పట్ల చాలా గౌరవం ఉంది. మోడీ ఉన్నంతకాలం భారతదేశం పోషించాల్సిన పాత్ర చాలా ఉంది. మోడీ ఎప్పుడూ ప్రశాంతంగా కనిపిస్తారు. కానీ చాలా గట్టి మనిషి అంటూ అభినందించారు.

### రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ

# ప్రధాన లక్ష్యం

మొదటిపేజీ తరువాయి..



ఈ సమీక్షలో చర్చించామని తెలిపారు.నాణ్యమైన వరి రకాల సాగుకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ సోనామసూరికి సంబంధించి వివిధ రకాలపై ఫోకస్ పెట్టామని వివరించారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ ఉన్న పంటలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పుకొచ్చారు. బాయిల్డ్ రైస్ కొనుగోళ్లు నిలిపివేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విధానాలతో తెలంగాణ రైతాంగం నష్టపోతోందని భట్టి విక్రమార్క విమర్శించారు. గ్రామగ్రామాన రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని రైతు కమిషన్ తెలిపింది. మేలుజాతి వంగడాలతో రైతుల ఆదాయం పెరుగుతుందని వ్యవసాయ కమిషన్ సూచించింది. రాబోయే సీజన్లలో నాణ్యమైన వరి రకాల సాగు విస్తరణ లక్ష్యమని పేర్కొంది. ఎఫ్‌సీఐ కొనుగోళ్లు తగ్గించడంతో రైతులకు ఇబ్బందిగా మారిందని వ్యవసాయ కమిషన్ అభిప్రాయపడింది.రైతాంగాన్ని అదుకునేందుకు ప్రజాప్రభుత్వం ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. జాతీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న మేలు రకాల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పేదలు కూడా సన్న బియ్యం తినాలి.. రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి అనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం నిర్ణయాలను తీసుకుని ముందుకు వెళుతోందని ఆయన అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు, నిల్వ సదుపాయాలు, వానకాలం సాగు పై కేబినెట్ సబ్ కమిటి చర్చిందింది. బిపిటి 5204, తెలంగాణ సోనా జై శ్రీరామ్, హెచ్ఎంటీ రకాల వంగడాలను రైతులు పెద్ద ఎత్తున సాగు చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని రైతు కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఆయా పంటలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉండడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. మేలుజాతి వంగడాలు సమృద్ధిగా ఉన్నాయని.. కాబట్టి వీటిని సాగు చేస్తే రైతులకు ఆదాయం గణనీయంగా ఉంటుదని వ్యవసాయ కమిషన్ తెలిపింది. ప్రభుత్వం ఈ వంగడాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, గ్రామ గ్రామాన రైతులను చైతన్యపరచడానికి ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కమిషన్ తెలిపింది. రాబోయే సీజన్లలో ఈ రకాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా అటు రైతులకు అదనపు ఆదాయం, ఇటు మార్కెట్ రంగానికి పూర్తి ప్రయోజనం చేకూరుతుందని, వరి సాగులో తెలంగాణ రాష్ట్రం మరింత లాభదాయకమైన దిశగా అడుగులు వేస్తుందని వ్యవసాయ కమిషన్ సైతం కేబినెట్ సబ్ కమిటీకి నివేదించింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.. కొనుగోళ్ళకు తగ్గిస్తూ మనల్ని ఇబ్బంది పెడుతోందని వ్యవసాయ కమిషన్ తెలిపింది. అంతేకాక బాయిల్డ్ రైస్ ను ఏమాత్రం కొనుగోలు చేయడం లేదని స్పష్టం చేసింది. రాష్ట్ర రైతాంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపింది. సమావేశంలో రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి, సీడ్ కార్పోరేషన్ చైర్మెన్ అన్వేష్ రెడ్డి, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జాతీయ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సంక్షేమం లేదు.. అంతా సంక్షోభమే




మొదటిపేజీ తరువాయి..

బూత్‌లెవల్ కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించారని అన్నారు. కేసీఆర్ మళ్లీ రావాలని తెలంగాణ ప్రజలు కోరుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తిరిగి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయం సంక్షోభంలోకి పోతే పట్టించుకున్న దిక్కు లేదని కేటీఆర్ విమర్శించారు. ఆర్థిక మంత్రి కమీషన్లకు అక్రమాలకు అంతం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని.. వారికి కనీసం యూరియా ఇచ్చే పరిస్థితి లేదని మాజీ మంత్రి అన్నారు. కేసీఆర్ చేసిన అప్పు..కాళేశ్వరం, భక్తరామదాసు, తెలంగాణ కొనసాగిస్తున్నారన్నారు. ఒక మంత్రి భూముల కబ్జాలకు పాల్పడుతుంటే, మరో మంత్రి వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారన్నారు. ఇక ఆర్థిక మంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. ప్రతిరోజు కేసీఆర్ అప్పులు చేశాడని మొరుగుతున్న నాయకులు ఎందుకు చేశారో బదులిచ్చారు. కేసీఆర్ చేసిన అప్పులకు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సజీవ సాక్షాలుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో లక్షల కోట్లు అప్పుచేసి ఏమి అభివృద్ధి చేసిందో రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఆలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ దందాలకు పాల్పడుతూ అనేక అక్రమాలకు ఊతమిస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో దృశ్యాలను సభా వేదికపై



అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమని స్పష్టం చేశారు. పేద విద్యార్థుల కోసం మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. బూత్‌ల వారీగా బలమైన కార్యకర్తల నిర్మాణం జరగాలని కేటీఆర్ అన్నారు. సర్ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని.. దేశంలో ఇప్పటికి 13 సార్లు జరిగిందని.. ఇప్పుడు 14వ సారి అని తెలిపారు. సర్‌ను పట్టించుకోక పోతే నష్టం తప్పదన్నారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల25 వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి బూత్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతి ఒక్క అంశాన్ని ప్రస్తావించాలని సూచించారు. ఇది చాలా కీలకమైన సమయమని, ఒక్క ఓటు కూడా పోకుండా చూసుకోవాలన్నారు. 'నిజాయతీగా ఎన్నికలు జరిగితే కేసీఆర్ ఈరోజు 100 సీట్లతో గెలుస్తారు.. నిజాయతీగా గెలవాలంటే మనం జాగ్రత్తగా ఉండాలి' అంటూ కార్యకర్తలకు కేటీఆర్ సూచించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. దాచుకోవడం దోచుకోవడం తప్ప జిల్లా అభివృద్ధికి వారు పాటుపడిందేమి లేదని స్వార్థ ప్రయోజనాల కోసమే పాలన ప్రదర్శించారు. మరికొద్ది రోజుల్లో ఎస్ ఐ ఆర్ పక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ప్రతి బిఎల్ఏ అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హత గల వ్యక్తుల ఓటర్లు తొలగించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో దిశా నిర్దేశర చేశారు. డిజిటల్ సభ్యత్వ నమోదులో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనకు వచ్చిన యువ నేత కేటీఆర్ కు అటు హెల్ప్ వద్ద ఇటు సభా ప్రాంగణం వద్ద కార్యకర్తలు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కలపల్లి రవీందర్రావు, తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చ నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు లింగాల కమల్ రాజ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, దిండిగాల రాజేందర్, మరికంటి ధనలక్ష్మి, పాలేరు నియోజకవర్గ నాలుగు మండలాల పార్టీ మాజీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, భాషపోయిన వీరన్న, పున్నం బ్రహ్మయ్య, వేముల వీరయ్య పాల్గొన్నారు

## ఇరాన్ యుద్ధంతో ఇంధన సంక్షోభం

మొదటిపేజీ తరువాయి..

జరపడం మంచి విషయమన్నారు. వృద్ధి గురించి ప్రస్తావన వస్తే.. జీడీపీ, వాణిజ్య



గణాంకాలు ప్రధానంగా ఉండకూడదు. ఎవరిది వృద్ధి..ఎవరికి వృద్ధి.. అది ఏ దిశలో ఉంది.. అనే అంశాలను చర్చించాలని మోదీ పేర్కొన్నారు.
ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయాయి. దీనిని ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనకబడిన దేశాలను వాటిమానాన వాటిని వదిలేయొద్దని, వాటికి సహకరించేందుకు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందుతోన్న దేశాలు ఈ షాక్‌లను తట్టుకొనేలా వ్యవస్థలు ఉండాలన్నారు. ఆయా దేశాల్లో ఉన్న మానవ వనరులను ప్రపంచ అభివృద్ధి భాగం చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సు నేపథ్యంలో ఇంతకుముందు మోదీ మాట్లాడుతూ.. ఇంధనం, ఆహారం, ఆరోగ్యం, సైబర్ సెక్యూరిటీ, ఆర్థిక భద్రత వంటి రంగాలు పెనవేసుకున్న ఈ ప్రపంచంలో.. మానవాళి పురోగతి, శ్రేయస్సు కోసం అంతర్జాతీయ భాగస్వామ్యాలను నిర్మించడం అత్యవసరమని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ సదస్సుకు ఫ్రాన్స్ ఆతిథ్యం ఇస్తోంది. ఆ దేశ ఆహ్వానం మేరకు మన ప్రధాని అక్కడకు వెళ్లారు. జీ-7లో కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యూకే, యూఎస్ఏ సభ్య దేశాలు. ఐరోపా యూనియన్ కూడా ఈ సదస్సుకు ప్రాతినిధ్యం వహిస్తోంది.

## సర్‌తో ముస్లిం ఓట్ల తొలగింపు కుట్ర

మొదటిపేజీ తరువాయి..

మీడియాతో మంత్రి అజారుద్దీన్ మాట్లాడారు. 'సర్' అంశంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరి ఓటుని వాళ్లే కాపాడుకునే బాధ్యత తీసుకోవాలని సూచించారు. 'సర్'లో తొలగించే ఓట్లతో గెలుపు, ఓటములు ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు. తాను ఎప్పుడూ మాట్లాడినా.. నిజాయితీగా మాట్లాడుతానని మంత్రి అజారుద్దీన్ తెలిపారు. తనకు తెలుగు రాయడం, చదవడం వచ్చు అని వివరించారు. తెలుగులో మాట్లాడటం మాత్రం కొంత ఇబ్బందిగా ఉంటుందని అన్నారు. చిన్నప్పుడు తెలుగులో రాయడం, చదవడం ప్రాక్టీస్ చేసేవాడినని తెలిపారు. తెలుగులో మాట్లాడితే తప్పులు పోతే కొంత ఇబ్బందిగా ఉంటుందని చెప్పారు. తనకు సులువుగా ఉండే భాషలోనే తాను మాట్లాడుతానని అన్నారు. తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అనవసరపు విమర్శలు చేస్తూనే ఉంటాయని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో అద్భుతమైన పాలన అందిస్తున్నామని వ్యాఖ్యానించారు. విద్యారంగంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని మంత్రి ఉద్ఘాటించారు. కేసీఆర్ హయాంలో పెండింగ్‌లో పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ని తమ ప్రభుత్వం చెల్లిస్తోందని స్పష్టం చేశారు. తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చాలామంది పేదలకు సాయపడ్డానని.. పలు సమస్యలు పరిష్కరించానని తెలిపారు. తనకు పబ్లిసిటీపై మోజు లేదని అన్నారు. 200 మందికి పైగా ఆయా సమస్యలు పరిష్కరించాలని తనకు దరఖాస్తులు ఇచ్చారని తెలిపారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించానని మంత్రి అజారుద్దీన్ పేర్కొన్నారు.



# వరంగల్ పర్యటనలో పవన్ కళ్యాణ్

మొదటిపేజీ తరువాయి..

తను ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్ పాటలకు వేసిన డాన్స్‌ల వీడియోలను నిరంజన్.. పవన్‌కు చూపించారు. తిరుమల నుంచి తెప్పించిన వస్త్రాన్ని నిరంజన్‌కు అందించారు. భద్రకాళి ఆలయంలో పూజ చేయించిన అమ్మవారి వెండి ప్రతిమను నిరంజన్ తల్లిదండ్రులకు అందజేశారు. ఇక, పవన్ పర్యటన నేపథ్యంలో అభిమానులు పెద్ద సంఖ్యలో బాలుడి ఇంటి దగ్గరికి చేరుకున్నారు. కాగా, నిరంజన్‌కు చిన్నప్పటి నుంచి పవన్ అంటే ప్రత్యేక అభిమానం. ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అతడు తన అభిమాన హీరో పవన్ కల్యాణ్‌ను కలవాలన్న కోరికను కుటుంబసభ్యులతో వెలిబుచ్చాడు. ఈ విషయం పవన్ వరకు వెళ్లింది. ఆయన తన అభిమాని కోసం హనుమకొండకు వచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన అభిమానిని కలిశారు. అతడికి చెప్పలేనంత సంతోషాన్ని అందించారు. జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ అనే బాలుడు తనకు అభిమాని అని, తనను కలవాలన్న అతడి ఆకాంక్షను తెలుసుకున్న పవన్.. ఉదయం నేరుగా బాలుడి నివాసానికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. తన పర్యటనకు సంబంధించిన ఫొటోలతో 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. కొద్ది రోజుల క్రితం వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన నిరంజన్ అనే యువకుడు అరుదైన వ్యాధితో పోరాడుతూ నన్ను కలవాలనే ఆకాంక్షను వ్యక్తం చేసిన వీడియోను చూశాను. నిరంజన్ ఆకాంక్షను నెరవేర్చాలని భావించాను. ఈరోజు హనుమకొండలోని అతని నివాసానికి వెళ్లి పరామర్శించాను. అరుదైన వ్యాధితో చేస్తున్న పోరాటంలో అతడి అసాధారణ ధైర్యం, ఆత్మవిశ్వాసం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు స్ఫూర్తిదాయకం. తీవ్రమైన అనారోగ్య సమస్యల మధ్య నిరంజన్ చూపుతున్న మనోధైర్యం ప్రశంసనీయం. నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రార్థించాను. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు అతనిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను. భగవంతుని ఆశీస్సులతో నిరంజన్ త్వరగా కోలుకోవాలి. ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో, మరింత ఉత్సాహంగా చూడాలని కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు. అదే సమయంలో వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి



సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖకు కృతజ్ఞతలు. తెలంగాణ ప్రజలు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, అభిమానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదాలు, ప్రేమ నాకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి. నాపై మీ మమకారాన్ని జీవితాంతం నా హృదయాంతరాల్లో నిలుపుకొంటాను' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపించి దాన్ని పెంచుకోవాలని ఉందని చెప్పగా, కొని పంపుతానని పవన్ హామీ ఇచ్చారు. కుక్కను పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా, స్వయంగా ఆ ఇంటి ఓనర్స్‌ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రులు వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటిన్‌లో పని చేసేవాళ్లమని చెప్పగా, వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర నేతలకు సూచించారు. నిరంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయన వెంట జనసేన నేతలు శంకర్ గౌడ్, శ్రీరామ్ తాళ్లూరి, రాధారం రాజలింగం, ఆర్ కె సాగర్ తదితరులు ఉన్నారు.

# గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



**ఖానాపురం జూన్ 17 (సాక్ష్యంన్యూస్):**
ఖానాపురం మండల కేంద్రంలో యాదవ కుల బాంధవుల ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి సోనబోయిన స్వామి తన స్వంత స్థలంను వితరణ చేశాడు. అర్చకులు పర్వతపు శివప్రసాద్ శాస్త్రి వేద మంత్రాలతో భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. యాదవ కుల పెద్దమనిషి జక్కుల సాయిలు, యాదవ కుల సంఘం గౌరవ అధ్యక్షుడు నూనెల కుమార స్వామి, అధ్యక్షుడు తోటకూరి రాజు, ఉపాధ్యక్షుడు భూష బోయిన శ్రవణ్, మరియు గ్రామంలోని వివిధ కుల సంఘాల పెద్దమనుషులు కోయగూరి కుమారస్వామి, ఉప్పు రాజు, వీరమల్ల శ్రీను, రెడ్డి నాగార్జున రెడ్డి, మల్యాల పోశెట్టి, గ్రామ సర్పంచ్ దాసరి రమేష్, ఏ ఎం సి వైస్ చైర్మన్, శాఖమూరి హరిబాబు, ఆత్మ డివిజన్ చైర్మన్ యడ్ల బిక్షం రెడ్డి,మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, మాజీ సర్పంచ్ పరుచూరి సుబ్బారావు, వార్డు సభ్యులు వేములపల్లి వెంకట ప్రసాద్ రావు, శాఖమూరి ముఖేష్ చౌదరి, మచ్చిక అశోక్ గౌడ్ యాదవ కుల బాంధవులు, సంఘ బాధ్యులు తోటకూరికుమారస్వామి ,జుర్రు యాకయ్య, తొట్ల సాంబయ్య, జటంగి పెద్ద కుమార్, జటంగి చిన్న కుమార్, భూష బోయిన నాగయ్య, వీరబోయిన ముత్యాలు, మారబోయిన రాజేందర్, చిన్నాల సారంగం, నూనెల కొమ్మాలు, వీరబోయిన గంగయ్య, రాజ బోయిన రాజు, లక్ష్మణ్, రఘు, భూష బోయిన అయిల్ మల్లు, స్వామి, సోనబోయిన వినీల్, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

### ఓటరు ప్రత్యేక సవరణ కార్యక్రమంపై
# అన్ని పార్టీల నేతలకు అవగాహన సమావేశం



**సికింద్రాబాద్, జూన్ 17 (సాక్ష్యం):**
సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో ఓటరు ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా తీసుకోవాల్సిన చర్యలు, అభ్యంతరాలు మరియు మార్పులు చేర్పులపై అధికారులు



నేతలకు వివరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ తరఫున రాజేందర్, రాజా సుందరం, జింకల మల్లేష్, వరికుప్పల శ్యామ్, రాజేష్, అశ్విన్, సునీల్ పాల్గొన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో రాజకీయ పార్టీల సహకారం కీలకమని అధికారులు పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# నాక్ష సర్వే పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికై సర్వే



**మహబూబాబాద్ జిల్లా కరస్పాండెంట్ ( జూన్.17)**
బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, నాక్ష సర్వే పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికై సర్వే కొనసాగుతున్న మహబూబాబాద్ పట్టణంలోని గుమ్మడూరు, జామండ్లపల్లి, తదితర ప్రదేశాలలో కొనసాగుతున్న ఇండ్ల సర్వే ను స్వయంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం తీసుకోవాల్సిన చర్యల గురించి కలెక్టర్ స్నేహ శబరీష్ , ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్, మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, లకు తగు సూచనలు జారీ చేశారు.క్షేత్రస్థాయిలో పక్కా సర్వేలు నిర్వహించాలని సూచించారు.ఇప్పటికే సూచించిన ప్రకారం నక్ష సర్వే కొనసాగుతుందని, ల్యాండ్ సర్వే ఏడి శ్రీనివాస్, తహసిల్దార్ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, తదితరులు కలెక్టర్కు తెలిపారు.

### నాచారం నాలాల పూడికతీత
# పనులను వెంటనే పూర్తి చేయాలి: బీజేపీ



**ఉప్పల్, జూన్ 17 (సాక్ష్యం):**
వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నాచారం పరిధిలో కొనసాగుతున్న నాలాల పూడికతీత పనులను వెంటనే పూర్తి చేసి ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ నాచారం డివిజన్ అధ్యక్షుడు నవీన్ కుమార్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బుధవారం నాచారం ప్రాంతంలోని నాలాలను సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్ రెడ్డి మాట్లాడుతూ, నాచారం నాలాలకు 2,300 మీటర్ల మేర డీసిల్టింగ్ పనులకు అనుమతులు మంజూరైనప్పటికీ కేవలం 1,000 మీటర్ల వరకు మాత్రమే పనులు నిర్వహించి మిగిలిన పనులను నిలిపివేశారని ఆరోపించారు. కూలిపోయిన రిటైనింగ్ వాల్స్, దెబ్బతిన్న ఫెన్సింగ్ను వెంటనే పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. మిగిలిన



పూడికతీత పనులు పూర్తి కాకపోవడంతో వర్షాకాలంలో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. సమస్యల పరిష్కారంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా నాలాల వెంట పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు మిగిలిన డీసిల్టింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని బీజేపీ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాగిరి మోహన్ రెడ్డి, మల్క ప్రకాష్, అనిత పద్మారెడ్డి, అభిషేక్ గౌడ్, రవికాంత్, ఉదయ్ కిరణ్ రెడ్డి, దయా గౌడ్, వెంకటేష్ గౌడ్, ఆనంద్ గుప్తా, సాయి గౌడ్, వరలక్ష్మి, బాలు, కృష్ణ గౌడ్, శేఖర్, సురేందర్, వెంకటేశ్వర్లు, కౌశిక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ రజక సంఘం రాష్ట్ర కన్వీనర్ కొన్నే సంపత్
# గృహప్రవేశ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, జూన్ 17 (సాక్ష్యం):**
తెలంగాణ రజక సంఘం రాష్ట్ర కన్వీనర్ కొన్నే సంపత్ నూతన గృహప్రవేశ మహోత్సవం బుధవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రముఖుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కొన్నే సంపత్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన గృహంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దంపతులు గృహప్రవేశ వేడుకల్లో పాల్గొని గృహ యజమానులను ఆశీర్వదించారు. అనంతరం కొన్నే సంపత్తో పాటు కుటుంబ సభ్యులను సన్మానించి, వారి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ రజక సంఘం బలోపేతానికి కృషి చేస్తున్న కొన్నే సంపత్ సేవలను ఈ సందర్భంగా పలువురు నాయకులు అభినందించారు. సమాజ అభ్యున్నతి కోసం ఐక్యంగా పనిచేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొన్నే సత్యం, దినేష్, గట్టికొప్పుల లక్ష్మీనర్సయ్య, సీహెచ్ శ్రీనివాస్, నివాస్, మంజుల, వైశాలి, కొన్నే అర్చనతో పాటు బంధుమిత్రులు, రజక సంఘం నాయకులు, స్థానిక ప్రముఖులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొన్నే సంపత్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.



### ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా
# సవరణ కార్యాచరణ సమావేశం విజయవంతం






**ఉప్పల్, జూన్ 17 (సాక్ష్యం):**
మల్లాపూర్లోని స్వాగత్ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సంబంధించిన ఉప్పల్ నియోజకవర్గ కార్యాచరణ సమావేశం ఉప్పల్ నియోజకవర్గ సమన్వయకర్త పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు.ఈ సమావేశానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పల్ మాజీ శాసనసభ్యుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లారెడ్డి, సుభాష్ రెడ్డి, మాజీ శాసన మండలి సభ్యుడు కాటేపల్లి జనార్ధన్ రెడ్డి, రవి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల నర్సింగరావు, జిల్లా సహ సమన్వయకర్త గౌరిగే కృష్ణ, నియోజకవర్గ బృంద సభ్యులు, బూత్ స్థాయి ప్రతినిధులు, శక్తి కేంద్రాల బాధ్యులు, సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, జిల్లా, రాష్ట్ర పదాధికారులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప్పల్ మాజీ శాసనసభ్యుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రక్షాళన, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, నకిలీ, ద్వంద్వ ఓట్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, అలాగే రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల నేపథ్యంలో బూత్ స్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణపై సమగ్రంగా మార్గనిర్దేశం చేశారు.ఈ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరూ పార్టీ నాయకత్వం సూచించిన మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉప్పల్ నియోజకవర్గ సమన్వయకర్త పోతగాని గోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. సమావేశం విజయవంతానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# ఖానాపురంలో జమ్మి మొక్క ప్రతిష్టాపన చేసిన సర్పంచ్



**ఖానాపురం జూన్ 17(సాక్ష్యం న్యూస్ ) :**
ఖానాపురం మండల కేంద్రం ఖానాపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ దాసరి రమేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి ఖానాపురం రైతు వేదిక వద్ద "జమ్మి మొక్క" ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా శమీ వృక్షం ప్రాధాన్యతను గుర్తుచేశారు. జమ్మి చెట్టు మన సంస్కృతికి, ఆచారాలకు ప్రతీక. శ్రీరాముడు అజ్ఞాతవాసం వెళ్లే ముందు, పాండవులు అజ్ఞాతవాస ఆయుధాలను దాచింది జమ్మి చెట్టు కిందనేనన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఇంటి ముందు మొక్కలు నాటాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు.హరితహారం లక్ష్యసాధనకు ఇది మనందరి బాధ్యత" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు ఉప సర్పంచ్ ఉప్పు రాజు, వార్డు సభ్యులు వేములపల్లి వెంకట ప్రసాద్ రావు,గుండ్లపల్లి విజయ్, చలిగంటి మల్లికార్జున్,గ్రామ పెద్దలు బొబ్బ విద్యాసాగర్ రావు,బోడ దేవా, మచ్చిక అశోక్, నంద్యాల వినయ్ రెడ్డి, రెడ్డి నాగార్జున రెడ్డి, మేడిద కుమార్, కోయగూర కుమార స్వామి, వేముల వెంకటేశ్వర రావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు,మఠ్రి రామస్వామి, పరుచూరి నరేంద్ర, వీరమళ్ళ శ్రీనివాస్, యాకయ్య, మల్యాల పోశెట్టి, భూక్య నవీన్, పల్నాటి శ్రీనివాస్,దాసి శ్రీనివాస్, యువజన సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొని మొక్కకు నీళ్లు పోశారు.

# తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

□ జనగామ జిల్లా అధ్యక్షులుగా చిట్యాల సోమన్న



**పాలకుర్తి జూన్ 17(సాక్ష్యం):**
జూన్ నెల 16న లింగాల గణపురం మండల కేంద్రంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడో మహాసభలో జిల్లా అధ్యక్షులుగా పాలకుర్తి గ్రామానికి చెందిన చిట్యాల సోమన్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి నాగయ్య తెలిపారు.ఈ సందర్భంగా నూతనంగా జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన సోమన్న మాట్లాడుతూకేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వివిజి రాంజీ చట్టాన్ని అమలు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాలలో పనులు దొరకని పరిస్థితి ఉ ందని. పెరిగిన ధరలకు అనుగుణంగా వ్యవసాయ కూలీలకు రోజువారిగా 700 రూపాయలు చెల్లించాలని, ప్రస్తుతం తీసుకొచ్చిన నూతన చట్టాన్ని రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వమే నేరుగా పాత పద్ధతి ప్రకారం 90% నిధులు విడుదల చేయాలని, కార్మికులను ఇబ్బంది పెట్టే రెండుసార్లు ఫోటోలు తీసే విధానాన్ని రద్దు చేయాలని మాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని కూలీలు పనిచేసే స్థలంలో కనీస సౌకర్యాలు కల్పించాలని, గత మహాసభ నుండి నిర్వహించిన పోరాటాలను సమీక్షించుకొని, భవిష్యత్తులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహిస్తూ, వ్యవసాయ కార్మిక సంఘం అన్ని గ్రామాల్లో విస్తరింప చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహించే పోరాటాల్లో వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని వారు కోరారు.

# ఫర్టిలైజర్ షాపులలో సీసీఎస్ పోలీసుల తనిఖీలు



**(సాక్ష్యం) జయశంకర్ - భూపాలపల్లి, జూన్ 17 :**
ఫర్టిలైజర్ షాపులలో సీసీఎస్ పోలీసుల తనిఖీలు భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో గణపురం మండలంలోని ఫర్టిలైజర్ షాపులలో సీసీఎస్ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా షాపులలోని స్టాక్ రిజిస్టర్లు, విత్తనాల నిల్వలను పరిశీలించారు. గడువు ముగిసిన విత్తన ప్యాకెట్లు, నకిలీ విత్తనాలు, విడి విత్తనాల విక్రయాలు చేయరాదని, ప్రతి విక్రయానికి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని షాపు యజమానులకు సూచించారు. వ్యవసాయదారులను మోసగించే విధంగా నిబంధనలకు విరుద్ధంగా విత్తనాల విక్రయాలు నిర్వహించినట్లయితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. వ్యవసాయదారులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, అనుమానాస్పద విత్తనాల విక్రయాలపై సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని సూచించారు.

# ప్రతి విద్యార్థి అమ్మ పేరు మీద ఒక మొక్క నాటాలి

□ డీఈఓ విజయకుమారి □ 'ఏక్ పేడ్ మా కే నామ్' పోస్టర్ ఆవిష్కరణ

**మహబూబ్నగర్, జూన్ 17 ( సాక్ష్యం బ్యూరో ) :**
కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి పిలుపునిచ్చారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ లక్ష్యంగా ప్రతి విద్యార్థి, ప్రతి పౌరుడు తమ అమ్మ పేరు మీద ఒక మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. పాఠశాలలు, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటి వివరాలను **ecoclubs.education.gov.in** వెబ్సైట్లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొని పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, డీఎస్ఓ షంషీర్, ఎంఈఓ మంజులత తదితరులు పాల్గొన్నారు.




# ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకుంటేనే పథకాలకు అర్హులు

- ఓటీపీ చెప్పేందుకు రైతులు వెనుకంజ
- అకౌంట్ల నుంచి డబ్బులు పోతాయానే భయం
- ఇంకా నమోదు చేసుకోని 4632 మంది రైతులు



**రాయపర్తి, జూన్ 17(సాక్ష్యం):** వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతుకు ఆధార్ తరహాలో 14 అంకెల ప్రత్యేక ఫార్మర్ ఐడీ అందించేందుకు కేంద్ర ప్రభుత్వం డిజిటలైజేషన్ ప్రక్రియను ప్రారంభించింది. కాని రైతులు పార్మర్ రిజిస్ట్రీ చేయించు కునేందుకు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసి వివరించినా గాని రైతులు ఇంకా వెనుకడుగు వేస్తున్నారు. ఈ ప్రక్రియ ఏడాది క్రితం మొదలు పెట్టినప్పటికి రైతులు ఆసక్తి చూపడంలో వెనుకంజ వేస్తున్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా చెరెందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియకు రైతులు తప్పని సరి నమోదు చేయించు కోవాలని అధికారులు అంటున్నారు. రాయపర్తి మండలంలో మొత్తం 40 గ్రామపంచాయతీ లు ఉండగా 18 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మొత్తం 20251 మంది వ్యవసాయ భూమి కలిగినా రైతులు ఉన్నారు. వీరి కోసం మండలం లో 5 క్లస్టర్ గ్రామాలుగా విభజించి 15619 మంది రైతులను రైతులుపార్మర్ రిజిస్ట్రీ చేయించారు. ఇంకా మిగిలిన 4632 మంది రైతులు రిజిస్ట్రీ చేసువాల్సి ఉందని కాని ముందుకు వచ్చేందుకు జంకుతున్నారని అధికారులు అంటున్నారు. రిజిస్ట్రీ చేసుకోవాలంటే రైతు వాడే ఫోనుకు మూడు సార్లు ఓటీపీ వస్తదని అది చెప్పేందుకు రైతులు అనుమానం వ్యక్తం చేసున్నట్లు ఆ శాఖ అధికారులు తెలుపుతున్నారు. తన సెల్ కు వచ్చిన ఓటీపీ చెప్పుతే అకౌంట్ నుంచి డబ్బులు పోతాయోనని బయపడుతున్నట్లు అధికారులు వివరిస్తున్నారు. రైతులు తమ ఆధార్ నంబర్ చెబితే చాలు, వ్యవసాయ విస్తరణ అధికారులు ఏఈఓ లు ఈ ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేస్తారు. అంతే కాదు మీ-సేవా కేంద్రాల్లో కూడా రైతులు స్వయంగా ఈ ప్రక్రియను పూర్తిచేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. అగ్రిస్టాక్ వెబ్సైట్లో ఆధార్ నంబర్ ను నమోదు చేసిన తర్వాత, దానికి అనుసంధా నమై ఫోన్ నంబర్ కు వచ్చే మూడు ఓటీపీ లను ఎంటర్ చేస్తే 14 అంకెల ఫార్మర్ ఐడీ క్రియేట్ అవుతుంది. రాయపర్తి మండలం లో ఏఈఓలు 5 క్లస్టర్ల వారీగా వీడి రైతులకు ఫార్మర్ ఐడీ ఆవశ్యకతను వివరిస్తూ వివరాలు నమోదు చేస్తున్నారు. ఇటీవల కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు సైతం ఈ ఫార్మర్ ఐడీని పొందాల్సి ఉంది.

**ఫార్మర్ రిజిస్ట్రీ రైతు కెందుకు అవసరం**

కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీలు, రుణాలు, ఇతర వ్యవసాయ పథకాలను సులభంగా పొందె దుకు వీలుగా ఫార్మర్ ఐడీని ఇస్తున్నారు. రైతు-తమ ఆధార్ కార్డు, భూ సంబంధిత పత్రాలు ఆధార్ లింక్ అయిన మొబైల్ ఫోన్ తమ వెంట తీసుకెళ్లి ఏఈఓ లను లేదా మీ- సే కేంద్రాలను సంప్రదించాలి. రిజిస్ట్రేషన్ పూర్తయి తర్వాత ప్రతి రైతుకు ఒక యూనిక్ గుర్తింపు సంకేటాయించబడుతుంది. ఈ ఐడీ లేకుంటే కేంద్ర ప్రభుత్వం అందించే ఏ పథకానికీ అర్హత ఉండదు అని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**రైతులందరు నమోదు చేసుకోవాలి**

**గుమ్మడి వీరభద్రం**
**రాయపర్తి మండల**
**వ్యవసాయా అధికారి**

వ్యవసాయా భూమి ఉన్న ప్రతి రైతు తప్పకుండ పార్మార్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని, చేసుకొనట్లయితే కేంద్ర ప్రభుత్వ పథకాలకు నో ఎంట్రీ అని, రిజిస్ట్రీ కోసం ఆధార్ కార్డు, భూమి పాస్ బుక్ ఆధార్ కార్డు కు అనుసంధానం అయినా ఫోన్ తీసుకొని వ్యవసాయా అధికారులకు గాని మీ సేవలో ఇస్తే వెంటనే నమోదు ప్రక్రియ మొదలవుతుందని మండల ఏవో గుమ్మడి వీరభద్రం అన్నారు.



# సెనెగల్‌పై ఫ్రాన్స్ ఘన విజయం

ఫిఫా వరల్డ్ కప్ 2026 గ్రూప్ దశలో భాగంగా న్యూజెర్సీ వేదికగా జరిగిన పోరులో ఫ్రాన్స్ 3–1 తేడాతో సెనెగల్‌పై ఘన విజయాన్ని నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో రెండు అద్భుతమైన గోల్స్‌తో మెరిసిన ఎంబాపె, జట్టును గెలిపించడమే కాకుండా ఫుట్‌బాల్ దిగ్గజాల రికార్డులను తిరగరాస్తూ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఫస్టాఫ్‌లో సెనెగల్ జట్టు ఫ్రాన్స్‌కు గట్టి సవాలు విసిరింది. కానీ, సెకండాఫ్‌లో ఎంబాపె వ్యూహంతో ఫ్రాన్స్‌ను విజయం వరించింది. సెనెగల్ జట్టు చాలా పక్కా ప్రణాళికతో బరిలోకి దిగింది. ఫ్రాన్స్ కెప్టెన్ కిలియన్ ఎంబాపెను కట్టడి చేయడమే లక్ష్యంగా ఆడింది. ఫలితంగా ఫస్టాఫ్ ముగిసేసరికి ఎంబాపె కేవలం 14 సార్లు మాత్రమే బంతిని తాకగలిగాడు. దీనితో మొదటి 45 నిమిషాల ఆట ఒక గోల్ నమోదు కాకుండానే ముగిసింది. ఇక సెకండాఫ్‌లో ఫ్రాన్స్ జట్టు పక్కా వ్యూహంతో మైదానంలోకి అడుగుపెట్టింది. ఎంబాపె ఒక్కసారిగా తన వేగాన్ని పెంచాడు. 66వ నిమిషంలో జూల్స్ కౌండే నుంచి అందిన ఒక అద్భుతమైన త్రూ–బాల్‌ను ఎంబాపె ఆధీనంలోకి తీసుకున్నాడు. అంతవరకు పెనాల్టీ బాక్స్‌లో బంతిని నియంత్రించడానికి ఇబ్బంది పడిన ఎంబాపె ఈసారి మాత్రం ఎలాంటి పొరపాటు చేయలేదు. అత్యంత చాకచక్యంగా బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపి ఫ్రాన్స్‌కు 1–0 ఆధిక్యాన్ని అందించాడు.

తొలి గోల్ వచ్చిన ఉత్సాహంలో ఫ్రాన్స్ మరింత దూకుడు పెంచింది. కొద్దిసేపటికే బ్రాడ్లీ బార్కోలా మరో గోల్ సాధించాడు. దీంతో ఫ్రాన్స్ ఆధిక్యం 2–0కు చేరింది. మ్యాచ్ దాదాపు ముగింపునకు వచ్చేసింది అనుకుంటున్న తరుణంలో, ఇంజూరీ టైమ్‌లో సెనెగల్ ప్లేయర్ గోల్‌గా మలిచాడు. దీంతో స్కోరు 2–1 గా మారి మ్యాచ్‌లో ఒక్కసారిగా ఉత్కంఠ పెరిగింది. దీంతో ఆ మ్యాచ్ డ్రా అవుతుందేమోనన్న ఆందోళనలో ఫ్రాన్స్




అభిమానులు ఉన్నారు. అయితే సెనెగల్ ఆనందం ఎక్కువ సేపు నిలవలేదు. ఫ్రాన్స్ ఎదురుదాడికి దిగింది. ఎంబాపె కొట్టిన లాంగ్–రేంజ్ షాట్ నెట్‌లోకి దూసుకెళ్లింది. ఈ అద్భుతమైన గోల్‌తో ఫ్రాన్స్ 3–1తో విజయాన్ని ఖరారు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో సాధించిన రెండు గోల్స్ ద్వారా కిలియన్ ఎంబాపే ప్రపంచకప్ చరిత్రలో సరికొత్త మైలురాళ్లను అధిగమించాడు. ఫ్రాన్స్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా ఇప్పటివరకు ఒలివియర్ గిరౌడ్ పేరిట ఉన్న రికార్డును ఎంబాపె బద్దలు కొట్టాడు. గిరౌడ్ 137 మ్యాచ్‌ల్లో 57 గోల్స్ సాధించగా, ఎంబాపే కేవలం 99 మ్యాచ్‌ల్లోనే 58 గోల్స్ మార్కును అందుకొని ఫ్రాన్స్ ఆల్–టైమ్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌కు ముందు ఎంబాపె ప్రపంచకప్‌లలో 12 గోల్స్‌తో బ్రెజిల్ లెజెండ్ పెలే సరసన ఉన్నాడు. కానీ ఈ మ్యాచులో చేసిన రెండు గోల్స్‌తో పెలేను, అలాగే అర్జెంటీనా స్టార్ లీనల్ మెస్సీని వరల్డ్ కప్ ఆల్–టైమ్ స్కోరింగ్ చార్ట్‌లో వెనక్కి నెట్టేశాడు. ప్రపంచకప్ టోర్నమెంట్లలో ఫ్రాన్స్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన దిగ్గజ ఆటగాడు జస్ట్ ఫాంటైన్ రికార్డును సైతం అధిగమిస్తూ, ఎంబాపే తన ఖాతాలో 14 వరల్డ్ కప్ గోల్స్ వేసుకున్నాడు. ఈ ఘనతతో అతను ప్రపంచకప్ చరిత్రలోనే అత్యధిక గోల్స్ చేసిన జర్మనీ ఆటగాడు మిరోస్లావ్ క్లోజ్ (16 గోల్స్) ఆల్–టైమ్ రికార్డుకు కేవలం రెండు గోల్స్ దూరంలో నిలిచాడు. సెనెగల్‌పై విజయం తర్వాత ఆ జట్టు కెప్టెన్, స్టార్ స్ట్రైకర్ కిలియన్ ఎంబాపె సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ప్రపంచకప్ లాంటి సుదీర్ఘ ప్రయాణానికి తమ జట్టు పూర్తిగా సిద్ధంగా ఉందని ప్రకటించాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం ఎంబాపె తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు పెట్టాడు. “టోర్నమెంట్‌ను విజయంతో ప్రారంభించడం ఎప్పుడూ చాలా ముఖ్యం. మా ముందున్న మార్గం చాలా పెద్దది. కానీ మేము దేనికైనా సిద్ధంగా ఉన్నాం,” అంటూ జట్టులో సరికొత్త జోష్ నింపాడు.

# సెంచరీతో ఇషాన్ కిషన్ అరుదైన ఘనత!

టీమిండియా యువ బ్యాటర్ ఇషాన్ కిషన్ అరుదైన ఘనతను సాధించాడు. వన్డేల్లో అత్యంత వేగంగా 1000 పరుగుల మైలురాయి అందుకున్న ఆరో భారత బ్యాటర్‌గా నిలిచాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా అఫ్గానిస్థాన్‌తో బుధవారం లక్నో వేదికగా జరిగిన రెండో వన్డేలో సెంచరీ చేయడం ద్వారా ఇషాన్ కిషన్ ఈ ఫీట్ సాధించాడు.కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి అద్వితీయమైన బ్యాటింగ్ చేసిన ఇషాన్ కిషన్ 71 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఇషాన్ కిషన్‌కు ఇది రెండో వన్డే శతకం. 79 బంతుల్లో 14 ఫోర్లు, 7 సిక్సర్ల సాయంతో 125 పరుగులు చేసి క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. శుభ్‌మన్ గిల్‌తో కలిసి మూడో వికెట్‌కు 224 పరుగులు జోడించాడు.అయితే ఈ మ్యాచ్‌లో ఇషాన్ కిషన్ తన 33వ పరుగుతో వన్డేల్లో 1000 పరుగుల మైలురాయి అందుకున్నాడు. ఈ మ్యాచ్‌కు ముందు అతను 28 మ్యాచ్‌ల్లో 967 పరుగులు చేశాడు. అయితే 966 బంతుల్లోనే ఇషాన్ కిషన్ 1000 పరుగులు చేయడం గమనార్హం. వన్డేల్లో అతి తక్కువ బంతుల్లో 1000 పరుగులు చేసిన భారత ఆటగాళ్ల జాబితాలో ఇషాన్ కిషన్ ఆరో స్థానంలో నిలిచాడు. ఈ జాబితాలో హార్దిక్ పాండ్యా, కేదార్ జాదవ్, కపిల్ దేవ్, శుభ్‌మన్ గిల్, ఎంఎస్ ధోనీ ఇషాన్ కిషన్ కంటే ముందు వరుసలో ఉన్నారు.ఇషాన్ కిషన్‌తో పాటు శుభ్‌మన్ గిల్ కూడా శతకంతో చెలరేగడంతో ఈ మ్యాచ్‌లో భారత్ భారీ స్కోర్ దిశగా దూసుకెళ్తోంది. వన్డేల్లో అఫ్గానిస్థాన్‌పై అత్యంత వేగంగా సెంచరీ నమోదు చేసిన మూడో బ్యాటర్‌గా కూడా ఇషాన్ కిషన్ నిలిచాడు. ఇయాన్ మోర్గాన్, రోహిత్ శర్మ మాత్రమే ఈ జాబితాలో ఇషాన్ కిషన్ కంటే ముందున్నాడు.



# అఫ్ఘాన్‌పై భారత్ భారీ స్కోరు..!

అఫ్ఘానిస్థాన్‌తో లక్నోలో జరుగుతున్న రెండో వన్డేలో భారత్ బ్యాటింగ్‌లో రెచ్చిపోయింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (154), ఇషాన్ కిషన్ అద్భుత సెంచరీలతో కదంతొక్కడంతో టీమిండియా 49.5 ఓవర్లలో 402 పరుగుల భారీ స్కోరు సాధించింది. రోహిత్ శర్మ 48 పరుగులతో రాణించగా, యశస్వి జైస్వాల్ (4) నిరాశపరిచాడు. ఇషాన్ కిషన్ ఆఖరిలో టీ20 తరహాలో బ్యాటింగ్ చేసి సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. అఫ్ఘాన్ బౌలర్లలో నంగియాలై కరోటే 4 వికెట్లు పడగొట్టాడు. అఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న రెండో వన్డేలో భారత్ భారీ స్కోరు చేసింది. లక్నో వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన అఫ్ఘానిస్థాన్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. దీంతో టీమిండియా ఫస్ట్ బ్యాటింగ్‌కు దిగింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఇషాన్ కిషన్ సెంచరీలతో భారత్.. భారీ స్కోరు చేసింది. 49.5 ఓవర్లలో 402 పరుగులకు ఆలౌట్ అయింది. రోహిత్ శర్మ 39 బంతుల్లో 48 రన్స్ చేసి సత్తాచాచాడు. రెగ్యులర్‌గా ఓపెనింగ్ స్థానంలో వచ్చే శుభ్‌మన్ గిల్.. తన ప్లేసును యశస్వి జైశ్వాల్‌కు త్యాగం చేశాడు. అయితే జైశ్వాల్ మాత్రం తనకు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. 9 బంతుల్లో 4 రన్స్ మాత్రమే చేసి ఔట్ అయ్యాడు. వన్‌డౌన్‌లో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అదరగొట్టాడు. గత మ్యాచ్‌లో సెంచరీ చేసిన అతడు.. ఇవాళ్టి మ్యాచ్‌లోనూ శతక్కొట్టి వరుసగా రెండో సెంచరీని నమోదు చేశాడు. 110 బంతుల్లో 154 రన్స్ చేశాడు. రోహిత్ శర్మ (39 బంతుల్లో 48 రన్స్) క్రీజులో ఉన్నంత సేపు ధాటిగా ఆడాడు. రోహిత్ ఔట్ అయ్యాక వచ్చిన ఇషాన్ కిషన్.. మెరుపు బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. హాఫ్ సెంచరీ చేసేవరకు సుమారు 100 స్ట్రైక్ రేట్‌తో రన్స్ చేసిన అతడు.. ఆ తర్వాత టీ20 క్రికెట్ తరహాలో రెచ్చిపోయాడు. ఏడా పెడా ఫోర్లు సిక్సర్లతో అదరగొట్టాడు. తొలి 52 బంతుల్లో 50 రన్స్ చేసిన ఇషాన్.. ఆ తర్వాత ఎదుర్కొన్న 27 బంతుల్లో ఏకంగా 75 పరుగులు రాబట్టాడు. దీంతో టీమిండియా భారీ స్కోరు దిశగా అడుగులు వేసింది. అయితే సెంచరీ హీరోలు ఇద్దరు చివర్లో ఔట్ కావడంతో స్కోరు బోర్డు కాస్త నెమ్మదించింది. చివరకు 49.5 ఓవర్లలో భారత్.. 402 పరుగులకు ఆలౌట్ అయింది. అఫ్ఘానిస్థాన్ బౌలర్లలో కరోటీ 4, రషీద్ ఖాన్ 3 వికెట్లు తీయగా.. ఘజన్‌ఫర్, సలీమ్ సఫీ ఒక్కో వికెట్ తీశారు. ప్రస్తుతం భారత్ సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి ఉంది.






# అఫ్గాన్–ఏపై భారత్–ఏ ఘన విజయం

ముక్కోణపు వన్డే సిరీస్‌లో తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్–ఏ అదరగొట్టింది. అఫ్గానిస్థాన్–ఏతో బుధవారం జరిగిన మ్యాచ్ సమష్టిగా రాణించిన భారత్–ఏ 101 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. స్పిన్ ఆల్‌రౌండర్ నిషాంత్ సింధు(4/31) నాలుగు వికెట్లతో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ భారీ విజయంతో ఈ ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్‌కు ఫైనల్ బెర్త్ దక్కింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్–ఏ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 319 పరుగుల భారీ స్కోర్ చేసింది. ప్రియాన్ష్ ఆర్య(42 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 58), తిలక్ వర్మ(75 బంతుల్లో 5 ఫోర్లతో 59), కుమార్ కుశాగ్ర(67 బంతుల్లో 5 ఫోర్లతో 58) హాఫ్ సెంచరీలతో రాణించగా.. వైభవ్ సూర్యవంశీ(28 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 38), రుతురాజ్ గైక్వాడ్(31 బంతుల్లో 4 ఫోర్లతో 30), విప్రజ్ నిగమ్(20 బంతుల్లో 4 ఫోర్లతో 30) పర్వాలేదనిపించారు. అఫ్గాన్–ఏ బౌలర్లలో ఫరిదూన్, అబ్దుల్లా అహ్మద్‌జై , ఫర్మనుల్లా రెండేసి వికెట్లు తీయగా.. జహీర్ ఖాన్ ఒక వికెట్ పడగొట్టాడు.అనంతరం అఫ్గానిస్థాన్–ఏ 36.5 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌటైంది. బహీర్ షా(52 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 57) హాఫ్ సెంచరీతో రాణించగా.. ఫైసల్(56 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 46) పర్వాలేదనిపించాడు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో నిశాంత్ సింధు(4/31)తో పాటు యశ్ ఠాకూర్(2/48) రెండు వికెట్లు పడగొట్టాడు. అన్షుల్ కంబోజ్, విప్రజ్ నిగమ్, సూర్యాన్ష్ షెడ్గే, అనుకుల్ రాయ్ తలో వికెట్ తీసారు. ఈ ముక్కోణపు సిరీస్‌లో 4 మ్యాచ్‌ల్లో 2 గెలిచిన భారత్ మెరుగైన రన్‌రేట్‌తో పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానంలో నిలిచింది. శ్రీలంక–ఏ, అఫ్గానిస్థాన్–ఏ మధ్య జరిగే ఆఖరి మ్యాచ్



ఫలితంతో ఈ సిరీస్ ఫైనలిస్టులు ఎవరనేది తేలనుంది. ఈ మ్యాచ్‌లో అఫ్గాన్–ఏ ఓడితే భారత్–ఏ, శ్రీలంక–ఏ ఫైనల్లో తలపడనున్నాయి. అఫ్గానిస్థాన్–ఏ గెలిస్తే.. మెరుగైన రన్ రేట్ ఉన్న జట్లకు ఫైనల్ బెర్త్ దక్కనుంది. భారత్‌కు మెరుగైన రన్‌రేట్ ఉన్న నేపథ్యంలో ఫైనల్ బెర్త్ ఖరారు అయింది.

# అల్జీరియాపై మెస్సి హాట్రిక్ గోల్స్

ఫుట్‌బాల్ లెజెండ్ లియోనెల్ మెస్సి తన సుదీర్ఘ కెరీర్‌లో మరో అద్భుతమైన చాప్టర్ యాడ్ చేశాడు. డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను లీడ్ చేస్తూ అల్జీరియాపై 3–0 తేడాతో ఘనవిజయం సాధించడంలో మెస్సి కీ రోల్ ప్లే చేశాడు. 38 ఏళ్ల వయసులో మెస్సి వరల్డ్ కప్ హిస్టరీలోనే ఫస్ట్ ఎవర్ హాట్రిక్ గోల్స్ సాధించి రికార్డు సృష్టించాడు. ఈ మ్యాచ్ లో ఫస్ట్ హాఫ్ లో ఒక గోల్ కొట్టిన మెస్సి, సెకండ్ హాఫ్ స్టార్ట్ అయిన కొద్దిసేపటికే సింపుల్ టాప్–ఇన్ తో రెండో గోల్ చేశాడు. ఆ తర్వాత 76వ నిమిషంలో తన ట్రేడ్‌మార్క్ స్టైల్లో మూడో గోల్ పూర్తి చేసి హాట్రిక్ నమోదు చేశాడు. దీంతో ఆరోహెడ్ స్టేడియంలో ఉన్న వేలాది మంది అర్జెంటీనా ఫ్యాన్స్ సంబరాల్లో మునిగిపోయారు. మెస్సి కెరీర్‌లో ఇది 61వ హాట్రిక్ కాగా అర్జెంటీనా తరఫున 11వ హాట్రిక్ కావడం విశేషం. ఈ ట్రెబుల్ తో వరల్డ్ కప్‌లో వరుసగా ఐదు మ్యాచ్‌ల్లో గోల్స్ చేసిన ప్లేయర్‌గా



మెస్సి నిలిచాడు. ఈ మ్యాజికల్ ఈవెనింగ్ మెస్సి లైఫ్ లో చాలా స్పెషల్ గా నిలిచిపోతుంది. మెస్సి 2006 లో జర్మనీ వేదికగా సెర్బియా, మోంటెనెగ్రోపై వరల్డ్ కప్ డెబ్యూ మ్యాచ్ ఆడి గోల్ కొట్టాడు. సరిగ్గా 20 ఏళ్ల తర్వాత అదే రోజున ఈ మైలురాయిని అందుకోవడం విశేషం. అర్జెంటీనా తరఫున 200వ అప్పీయరెన్స్ ఇచ్చిన ఈ ఎనిమిది సార్లు బ్యాలన్ డి ఓర్ విన్నర్, పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో తర్వాత ఐదు వేర్వేరు వరల్డ్ కప్ ఎడిషన్లలో గోల్స్ చేసిన సెకండ్ ప్లేయర్‌గా రికార్డుకెక్కాడు. ఈ హాట్రిక్ తో మెస్సి వరల్డ్ కప్ టోటల్ గోల్స్ సంఖ్య 16కు చేరింది. జర్మనీ లెజెండ్ మిరొస్లావ్ క్లోజ్ చాలా కాలంగా మెయింటైన్ చేస్తున్న ఆల్ టైమ్ గోల్ స్కోరింగ్ (16 గోల్స్) రికార్డును మెస్సి సమం చేశాడు. అర్జెంటీనా డిఫెన్స్ టైటిల్ రేసులో ఇంకా చాలా మ్యాచ్‌లు మిగిలి ఉండటంతో మెస్సి ఈ రికార్డును బ్రేక్ చేయడం చాలా ఈజీ అని అనిపిస్తోంది. మెస్సి సృష్టించిన విధ్వంసం వల్ల ఇతర ఫుట్‌బాల్ స్టార్స్ చేసిన అద్భుతాలు మరుగునపడిపోయాయి. ఫ్రాన్స్ ఫార్వర్డ్ ప్లేయర్ కిలియన్ ఎంబాపె సైతం సెనెగల్‌తో జరిగిన మ్యాచ్‌లో రెండు గోల్స్ చేసి తన టీమ్‌ను 3–1 తో గెలిపించాడు. ఎంబాపె వరల్డ్ కప్‌లో తన టోటల్ గోల్స్ సంఖ్యను 14కు చేర్చి వెస్ట్ జర్మనీ గ్రేట్ గెరార్డ్ ముల్లర్ సరసన ఫోర్త్ ప్లేస్ లో నిలిచాడు. ఇటు నార్వే స్టార్ ఎర్లింగ్ హాలాండ్ కూడా ఇరాక్‌తో జరిగిన మ్యాచ్‌లో రెండు గోల్స్ కొట్టి తన టీమ్‌కు 4–1 తో బిగ్ విక్టరీ అందించాడు. కానీ ఆ నైట్ మాత్రం కంప్లీట్‌గా అర్జెంటీనా ఐకాన్ మెస్సినే తన మాయతో హైజాక్ చేశాడు. అర్జెంటీనా టీమ్ కాన్సాస్ సిటీకి వచ్చినప్పటి నుంచి అక్కడ 'మెస్సి మేనియా' పీక్స్‌కు చేరింది. ఆరోహెడ్ స్టేడియం పరిసర ప్రాంతాలన్నీ మెస్సి ఫ్యాన్స్‌తో కిక్కిరిసిపోయాయి. ఐకానిక్ నంబర్ 10 జెర్సీలు వేసుకున్న వేలాది మంది ఫ్యాన్స్ నేషనల్ ఫుట్‌బాల్ లీగ్ కు హోమ్ గ్రౌండ్ అయిన ఈ స్టేడియాన్ని బ్లూ అండ్ వైట్ కలర్‌తో నింపేశారు. రోసారియో నుంచి వచ్చిన తమ హీరోను పొగుడుతూ పాటలు పాడుతూ స్టేడియంలో హోరెత్తించారు. అమెరికాలో మెస్సి క్రేజ్ ఏ రేంజ్ లో ఉందో ఈ మ్యాచ్ ప్రజెంటేషన్ స్పష్టం చేసింది.

# నెదర్లాండ్స్‌పై టీమిండియా మహిళల విశ్వరూపం

## వరల్డ్ కప్ హిస్టరీలో మరో భారీ స్కోర్ నమోదు..


మహిళల టీ20 క్రికెట్ ప్రపంచకప్‌లో పరుగుల సునామీ కురుస్తోంది. మైదానంలోకి దిగితే చాలు సిక్సర్లు, ఫోర్ల వర్షంతో బ్యాటర్లు స్టేడియాలను హోరెత్తిస్తున్నారు. తాజాగా ఇంగ్లాండ్, భారత్ జట్లు సృష్టించిన సునామీతో ఐసీసీ ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ చరిత్రలోనే అత్యధిక స్కోర్ల రికార్డులు మారిపోతున్నాయి. మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా ఇంగ్లాండ్ ఉమెన్స్ టీమ్ సరికొత్త రికార్డు సృష్టించింది. 2026 జూన్ 12న బర్మింగ్‌హామ్ వేదికగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ బ్యాటర్లు లంక బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టారు. నిర్ణీత 20 ఓవర్లలో కేవలం ఒకే ఒక్క వికెట్ కోల్పోయి ఏకంగా 219 పరుగుల భారీ స్కోరు సాధించారు. ఓవర్ కి 10.95 రన్ రేట్‌తో సాగిన ఈ ఇన్నింగ్స్ ఉమెన్స్ క్రికెట్ హిస్టరీలోనే ఒక మైలురాయిగా నిలిచిపోయింది. బౌండరీల వర్షం కురిపించిన ఇంగ్లాండ్ టీమ్, ఆ మ్యాచ్‌లో ఘనవిజయం సాధించి చరిత్ర పుటల్లోకెక్కింది. కేవలం ఈ ఏడాదే కాదు, గతంలోనూ ఇంగ్లాండ్ జట్టు ఇలాంటి పరుగుల విధ్వంసాన్నే సృష్టించింది. ఈ జాబితాలో రెండో స్థానం కూడా ఇంగ్లాండ్ ఖాతాలోనే ఉంది. 2023 ఫిబ్రవరి 21న కేప్ టౌన్ వేదికగా పాకిస్తాన్‌తో జరిగిన వరల్డ్ కప్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. పాక్ బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ 10.65 రన్ రేట్‌తో ఈ స్కోరును నమోదు చేశారు. ఈ మ్యాచ్‌లోనూ ఇంగ్లాండ్ ఘన విజయాన్ని అందుకుంది. ఇక తాజాగా లీడ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు సరికొత్త రికార్డును తన పేరిట లిఖించుకుంది. నెదర్లాండ్స్ జట్టుతో జరిగిన ఉ



త్కంఠభరిత పోరులో టీమిండియా బ్యాటర్లు చెలరేగి ఆడారు. 20 ఓవర్లలోనే 5 వికెట్ల నష్టానికి 209 పరుగుల భారీ స్కోరును బోర్డుపై ఉంచారు. 10.45 రన్ రేట్‌తో భారత బ్యాటర్లు బౌండరీలు, సిక్సర్లతో విరుచుకపడ్డారు. వరల్డ్ కప్ హిస్టరీలోనే అత్యధిక స్కోరు సాధించిన జట్ల జాబితాలో టీమిండియా సగర్వంగా టాప్ 3 లో నిలిచింది. ఇంగ్లాండ్ ఆధిపత్యానికి గట్టి పోటీ ఇస్తూ భారత్ సాధించిన ఈ స్కోరు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది.

# వైభవ్ సూర్యవంశీని జట్టు నుంచి తప్పించాల్సింది

మైదానంలో గొడవకు దిగిన టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందని మాజీ క్రికెటర్, వివాదాస్పద కామెంటేటర్ సంజయ్ మంజ్రేకర్ అన్నాడు. ఓ మ్యాచ్ ఆడినవ్వకుండా పక్కన పెట్టి అతనికి గుణపాఠం చెప్పాల్సిందని అభిప్రాయపడ్డాడు. ముక్కోణపు వన్డే సిరీస్‌లో భాగంగా శ్రీలంక–ఏతో ఉత్కంఠగా జరిగిన గత మ్యాచ్‌లో భారత్–ఏ సూపర్ ఓవర్‌లో ఓటమిపాలైన సంగతి తెలిసిందే. సూపర్ ఓవర్ అనంతరం ఎగతాళి చేసిన శ్రీలంక ఆటగాడిని వైభవ్ సూర్యవంశీ నెట్టేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించిన సంజయ్ మంజ్రేకర్.. అఫ్గానిస్థాన్–ఏతో జరిగిన మ్యాచ్‌కు వైభవ్ సూర్యవంశీని పక్కన పెట్టాల్సిందని అభిప్రాయపడ్డాడు. 'నేను గనుక భారత్–ఏ జట్టుకు కోచ్ లేదా మేనజర్‌గా ఉండి ఉంటే.. అఫ్గానిస్థాన్ ఏ జట్టుతో జరిగిన మ్యాచ్ నుంచి వైభవ్ సూర్యవంశీని కచ్చితంగా తొలగించేవాడిని. ఎంత రెచ్చగొట్టినప్పటికీ.. ఎలాంటి పరిస్థితుల్లోనైనా మైదానంలో భౌతికంగా గొడవపడటం ఆమోదయోగ్యం కాదు. 'అని సంజయ్ మంజ్రేకర్ ట్వీట్ చేశాడు. శ్రీలంక ఆటగాడు విషెన్ హలంబకే హద్దులు ధాటాడని, శ్రీలంక విజయానంతరం ఇంటికి వెళ్లు.. ఇది ఐపీఎల్ కాదని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడని వార్తలు వచ్చినా.. వైభవ్ సూర్యవంశీ తీరును సంజయ్ మంజ్రేకర్ తప్పుబట్టాడు. అతను క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించాడని తెలిపాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో 776 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ అందుకున్న వైభవ్ సూర్యవంశీ టీమిండియా పిలుపు కూడా అందుకున్నాడు.



## జూన్ 27న మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతోన్న విష్ణు మంచు 'కన్నప్ప'

డైనమిక్ హీరో విష్ణు మంచు గత ఏడాది 'కన్నప్ప' అంటూ ఆడియెన్స్‌ను ఎంతగానో ఆకట్టుకున్నారు. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద 'కన్నప్ప' మూవీని డా. ఎం. మోహన్ బాబు నిర్మించిన సంగతి తెలిసిందే. ముఖేష్ కుమార్ సింగ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇక ఈ ప్రాజెక్ట్‌లో అక్షయ్ కుమార్, మోహన్ లాల్, ప్రభాస్, కాజల్, బ్రహ్మానందం ఇలా ఎంతో మంది గొప్ప నటీనటులు కీలక పాత్రలను పోషించడంతో ప్యాన్ ఇండియా వైడ్‌గా క్రేజ్‌ను దక్కించుకుంది. 'కన్నప్ప' సినిమాకి తెలుగులో వచ్చిన ఆదరణ, క్లైమాక్స్‌లో విష్ణు నటనకు వచ్చిన ప్రశంసల గురించి అందరికీ తెలిసిందే. మరోసారి ఈ విజువల్ వండర్‌ను ఆడియెన్స్‌కి అందించేందుకు విష్ణు మంచు రెడీ అయ్యారు. సినిమా రిలీజ్ అయి ఏడాది అవుతున్న సందర్భంగా మళ్లీ జూన్ 27న 'కన్నప్ప'ని లిమిటెడ్ స్క్రీన్‌లలో రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మేరకు విడుదల చేసిన రీ రిలీజ్ డేట్ పోస్టర్ వైరల్ అవుతోంది.

## శ్రీ విష్ణు, జానకిరామ్ మారెళ్ల, స్కంద వాహన మోషన్ పిక్చర్స్ LLP 'కామ్రేడ్ కళ్యాణ్' ఫస్ట్ సింగిల్ ఒరియా పిల్లా జూన్ 20న రిలీజ్

కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీ విష్ణు తన వెర్సటైల్ పెర్ఫార్మెన్స్, యూనిక్ కథలతో అలరిస్తున్నారు. ప్రతి సినిమాలోనూ హ్యూమర్ వుండేలా చూసుకునే శ్రీవిష్ణు తన లేటెస్ట్ ఫన్‌ఫుల్ యాక్షన్ ఎంటర్టైనర్ 'కామ్రేడ్ కల్యాణ్'తో వస్తున్నారు. ఈ చిత్రాన్ని వెంకట్ ప్రెజెంట్ చేస్తుండగా, జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం హిస్తున్నారు. వెంకటకృష్ణ కర్నాటి, సీతా కర్నాటి స్కంద వాహన మోషన్ పిక్చర్స్



ఎల్ఎల్‌పీ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ట్ చేస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ సింగిల్ ఒరియా పిల్లా జూన్ 20న రిలీజ్ చేయనున్నారు. సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో శ్రీవిష్ణు, మహిమా మధ్య కనిపించిన అందమైన కెమిస్ట్రీ, లవ్ వైబ్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమయే కీలక పాత్రలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సాయి శ్రీరామ్ డీవోపీ, విజయ్ బుల్గానిన్ మ్యూజిక్, చోటా కె ప్రసాద్ ఎడిటర్ గా పని చేస్తున్నారు.



## శ్రీతేజ్, రత్నాకరం అనిల్ రాజు, శ్రీధర్ గంగపట్నం, ఎస్‌వీకే సినిమాస్ 'రాంబో' పవర్‌ఫుల్ గ్లింప్స్ రిలీజ్

యంగ్ ట్యాలెంటెడ్ శ్రీతేజ్ టైటిల్ పాత్రలో నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'రాంబో'. రత్నాకరం అనిల్ రాజు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని, హిడింబ వంటి సూపర్ హిట్ చిత్రాన్ని అందించిన నిర్మాత శ్రీధర్ గంగపట్నం, ఎస్‌వీకే సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. తాజాగా చిత్ర బృందం విడుదల చేసిన 'రాంబో' గ్లింప్స్ ప్రేక్షకుల్లో సినిమాపై అంచనాలు పెంచింది. "ఒక మృగం మనిషిగా పుడితే వాడే రాంబో" అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో ప్రారంభమైన గ్లింప్స్ వైల్డ్ యాక్షన్ తో ఆకట్టుకుంది. శ్రీతేజ్ ఇంటెన్స్, అగ్రెసివ్ బాడీ లాంగ్వేజ్‌తో పాత్రలో పూర్తిగా ఒదిగిపోయారు. ముఖ్యంగా యాక్షన్ సన్నివేశాల్లో ఆయన చూపించిన వైల్డ్ ఎనర్జీ, స్క్రీన్ ప్రెజెన్స్ పాత్రను మరింత బలంగా నిలబెట్టాయి. దర్శకుడు రత్నాకరం అనిల్ రాజు రాంబో పాత్రను డిజైన్ చేసిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హీరో క్యారెక్టర్‌లోని వైల్డ్ ఎమోషన్స్ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశారు. స్టార్ సినిమాటోగ్రాఫర్ శ్యామ్ కె. నాయుడు అందించిన విజువల్స్ గ్లింప్స్‌కు పర్ఫెక్ట్ లుక్ తీసుకొచ్చాయి. ప్రతి ఫ్రేమ్ కథలోని ఇంటెన్సిటీ మరింత బలంగా కనిపించింది. సునీల్ కశ్యప్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ యాక్షన్ బ్లాక్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్లగా, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్ గ్లింప్స్‌ను మరింత షార్ప్‌గా, గ్రిప్పింగ్‌గా మలిచింది. మొత్తంగా, 'రాంబో' గ్లింప్స్ ఒక రా, వైల్డ్, పవర్‌ఫుల్ యాక్షన్ ఎక్స్‌పీరియన్స్‌కు హామీ ఇస్తూ, సినిమాపై ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచింది.

## థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సాగే 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా ఉంటుంది

**– హీరో, నిర్మాత వడ్డే నవీన్**

వడ్డే జిష్ణు సమర్పణలో వడ్డే క్రియేషన్స్ బ్యానర్ మీద వడ్డే నవీన్ హీరోగా, నిర్మాతగా రూపొందించిన చిత్రం 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు'. కమల్ తేజ నార్ల ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాలో వడ్డే నవీన్, రాశి సింగ్, శిల్పా తులస్కర్, వివేక్ రఘువంశీ, రఘుబాబు, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, జ్వాలా కోటి, దేవి ప్రసాద్, సూర్య, బాబా బాస్కర్, ప్రమోదిని, సాత్విక్ రాజు, అంజలి ప్రియ, గాయత్రి చాగంటి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ మూవీని జూన్ 19న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో బుధవారం నాడు వడ్డే నవీన్ మీడియాతో ముచ్చటించారు. ఈ చిత్రం గురించి ఆయన చెప్పిన సంగతులివే..

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' కథను ఎంచుకోవడానికి గల కారణాలు ఏంటి?**

'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' సినిమాలోని పాయింట్, కథ చాలా డిఫరెంట్‌గా, కొత్తగా ఉంటుంది. ఈ కథ నాకు చాలా నచ్చింది. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా సినిమా ఉంటుంది. ఇందులో నా పాత్ర చాలా కొత్తగా అనిపిస్తుంది.

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' మీ కంఫర్ట్ జోన్‌కి దూరంగా ఉంది కదా?**

ప్రస్తుతం ప్రేక్షకులు సినిమాల్ని చూసే తీరు మారింది. కేవలం కుటుంబ కథా చిత్రాలు, ప్రేమ కథా చిత్రాల్ని ఇస్తే సరిపోవడం లేదు. అన్ని అంశాల్ని జోడించి సరికొత్త పాయింట్, కంటెంట్‌ను అందిస్తేనే ఆదరిస్తున్నారు. ఈ 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రంలో కొత్త కంటెంట్ ఉంటూనే.. ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా తెరకెక్కించాం.

**రీ ఎంట్రీలో మీరే నిర్మాతగా ఎందుకు మారాల్సి వచ్చింది?**

నాకు ఈ కథ మీదున్న నమ్మకం వేరే నిర్మాతలకు ఉండాలని లేదు. వేరే నిర్మాత అయితే కథ మారుస్తారని



కాదు.. ఈ కథని నేను నమ్మాను. నిర్మించేందుకు కూడా ముందుకు వచ్చాను.

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చిత్రంలో ఎంటర్టైన్మెంట్ ఉంటుందా?**

త్రిమూర్తులు పాత్రలోనే ఎంతో ఎంటర్టైన్మెంట్ ఉంటుంది. కానిస్టేబుల్ పాత్రకి తగ్గట్టుగానే ఇందులో కనిపిస్తాను. ఈ సినిమా అయితే ప్రేక్షకులు ఊహించినట్టుగా రెగ్యులర్‌గా ఉండదు. సిస్టంలో ఉంటూనే పోరాడే కానిస్టేబుల్ పాత్రలో నేను కనిపిస్తాను. స్క్రిప్ట్ మీద ఏడాది పాటుగా పని చేశాం.

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' ఎంత రియలిస్టిక్ ఉంటుంది?**

'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చాలా వరకు రియలిస్టిక్‌గానే ఉంటుంది. పూర్తిగా ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌లా ఉండదు. అవసరం ఉన్న చోట మాత్రమే ఫైట్, పాటలను పెట్టాం.

**నిర్మాణంలో అప్పటికి, ఇప్పటికి వచ్చిన మార్పులను గమనించారా?**

ఇప్పుడు కాస్ట్ ఆఫ్ ప్రొడక్షన్ పెరిగింది. నిర్మాణంలోనూ చాలా మార్పులు వచ్చాయి. అయితే అన్నీ పక్కాగా ముందే ప్లాన్ చేసుకున్నాం కాబట్టి మాకు ఎక్కడా ఎలాంటి సమస్య రాలేదు. అనుకున్న బడ్జెట్ కంటే కాస్త ఎక్కువే అయింది. ఇప్పటికే జీ టీం ఓటీటీ హక్కుల్ని తీసుకుంది.

**దర్శకుడు కమల్ గురించి చెప్పండి?**

కమల్ ఈ కథ మీద చాలా వర్క్ చేశాడు. మేం దాదాపు ఏడాది పాటుగా కేవలం స్క్రిప్ట్ మీదే ఉన్నాం. కమల్ మేకింగ్, టేకింగ్ చాలా కొత్తగా అనిపించింది.

**రాశీ సింగ్ గురించి చెప్పండి?**

త్రిమూర్తులు భార్యగా ఆమె కనిపిస్తారు. రాశీ గారు అద్భుతంగా నటించారు. ఆమె పాత్ర అందరినీ ఆకట్టుకుంటుంది.

**ప్రస్తుతం ఆడియెన్స్ మీ మీద కురిపిస్తున్న ప్రేమను చూస్తున్నారా?**

గత పన్నెండేళ్లలో మన తెలుగు ఆడియెన్స్ నేను ఎక్కడ కనిపించినా కూడా 'మళ్లీ సినిమాలు చేయండి సార్' అని ప్రేమగా అడిగేవారు. ఇప్పుడు మా సినిమా మీద, నా మీద కురిపిస్తున్న ప్రేమను చూస్తున్నాను. వారి అభిమానానికి ఎప్పుడూ రుణపడే ఉంటాను.

**ఈ మధ్య కాలంలో మీకు నచ్చిన పాత్రలు, సినిమాలు ఏంటి?**

నాకు 'రంగస్థలం' మూవీ నచ్చింది. అందులో రామ్ చరణ్, జగపతి బాబు పాత్రలు నచ్చాయి. 'పుష్ప'లో అల్లు అర్జున్ పాత్ర నచ్చింది. రీసెంట్‌గా అంటే చిరంజీవి గారు చేసిన 'మన శంకర వర ప్రసాద్ గారు' నచ్చింది.

**పెద్ద దర్శకులతో సినిమా చేసే అవకాశం ఉన్నా కూడా కొత్త డైరెక్టర్‌తో ఎందుకు చేశారు?**

నేరుగానే పెద్ద దర్శకుడితో సినిమా చేయొచ్చు. కానీ ముందు నా మార్కెట్ ఎంత ఉందో తెలియాలి. పైగా అవతల ఉన్న పెద్ద దర్శకులకు నాతో చేయాలని కూడా ఉండాలి. ముందు నా సినిమా బయటకు వస్తే.. నా మార్కెట్ తెలుస్తుంది.

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' రిలీజ్ తర్వాత ఎలాంటి ప్రశంసలు వస్తాయని అనుకుంటున్నారు?**

'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' చూశాక మంచి సినిమా చేశాడు అనే ఫీడ్ బ్యాక్ ఇస్తారని మాత్రం ఆడియెన్స్ నుంచి వస్తుందని నమ్ముతున్నాను. ఇప్పటి వరకు నా ఫ్యామిలీ మెంబర్లలో ఓ వంద మంది చూశారు. అందరూ చిత్రాన్ని చూసి సర్ ప్రైజ్ అయ్యారు. నన్ను నేను ప్రమోట్ చేసుకునేలా సినిమా తీసి ఉంటానని వాళ్లంతా అనుకుని ఉంటారు. కానీ కథ, కంటెంట్ ఇవన్నీ చూసి అందరూ షాక్ అయ్యారు.

**ప్రస్తుతం ఉన్న హీరోల్లో మీకు నచ్చిన వారు ఎవరు?**

నాని, శర్వానంద్ మంచి పాత్రలు, సినిమాలు చేస్తున్నారు. 'కోర్ట్' బాగా నచ్చింది. 'లిటిల్ హార్ట్స్' అబ్బాయి బాగా చేశాడు. చిరంజీవి గారు చేసిన 'మన శంకర వరప్రసాద్ గారు' చాలా నచ్చింది.

**నెక్ట్స్ ఎలాంటి ప్రాజెక్టులు చేయాలని అనుకుంటున్నారు?**


ప్రస్తుతం సోలో హీరోగా చేస్తున్నాను. అలానే కంటిన్యూ అవ్వాలని అనుకుంటున్నాను. కథ నచ్చితే మల్టీస్టారర్ అయినా సరే చేస్తాను. కంటెంట్ నచ్చితే ఓటీటీ కోసం కూడా ప్రాజెక్ట్ చేస్తాను.

**'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు' ఎలా ఉండబోతోంది?**

కథ నెమ్మదిగానే ప్రారంభం అవుతుంది. కానీ సంఘర్షణ మొదలయ్యాక.. క్లైమాక్స్ వరకు గ్రిప్పింగ్‌గా వెళ్తుంది. క్లైమాక్స్‌ని మాత్రం ఎవ్వరూ ఊహించలేరు.

## "దీవాన" సరికొత్త ప్రేమ కథతో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది - డైరెక్టర్ శ్రీకాంత్ సంగిశెట్టి

శుభం సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా "దీవాన". ఈ చిత్రాన్ని అర్థ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. ఈ బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో హీరోయిన్ స్నేహ మణిమేగలై, దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి పరిచయం కానున్నారు. "దీవాన" సినిమా గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ నెల 19న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తోంది. ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి మూవీ హైలైట్స్ తెలిపారు. * ప దేళ్ల కిందట వచ్చిన ప్రయోగాత్మక చిత్రం మిణుగురులు చిత్రానికి అసిస్టెంట్ గా పనిచేశా. ఆ చిత్రానికి నంది అవార్డు కూడా వచ్చింది. ఆస్కార్ లైబ్రరీలో ఆ స్క్రిప్ట్ భద్రపరిచారు. పదేళ్లకుపైగా ఓ కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగం చేశాను. చిన్న చిన్న డెమో ఫిల్మ్స్, సాంగ్స్, షార్ట్స్ ఫిల్మ్స్ చేసేవాణ్ని. సినిమాలు, ఇంటర్వ్యూలు చూసి సినిమా గురించి నేర్చుకున్నా. షార్ట్స్, కలర్ ఫాలెట్ ఏవీ నేర్చుకోలేదు. సినిమా చూస్తూ సినిమాను ఎంజాయ్ చేసేవాణ్ని. సినిమా నచ్చకపోతే బాగా తిట్టేవాణ్ని. చెత్త రైటింగ్ కు అవకాశం వచ్చింది. నాకెందుకు అవకాశం రాలేదనుకునేవాణ్ని. ఒక రకమైన ఫ్రస్టేషన్ ఉండేది. నా కథలన్నీ గొప్పగా ఉంటాయి. వాటన్నింటిని తెరపై చూడాలని ఉండేది. చూసిన వాళ్లంతా ఎవర్రా ఈ సినిమా తీసిందని గొప్పగా మాట్లాడుకోవాలి. అదే నా మైండ్ లో రన్ అవుతూ ఉండేది. నేను 10 గంటలు కూర్చొని ఉద్యోగం చేస్తున్నప్పుడల్లా నా మైండ్ లో మొత్తం సినిమానే రన్ అవుతూ ఉండేది. జాబ్ లో ప్రమోషన్స్ కూడా వద్దనుకునేవాణ్ని. ఎందుకంటే ఆ పని నాకు నచ్చేది కాదు. నాకు మ్యాథ్స్ రాదు, సాఫ్ట్ వేర్ రాదు. ఎక్సెల్ రాదు, నాకు వచ్చింది కలలు కనడం. ఎన్నేళ్లైనా కూడా నాకు ఇప్పుడే పుట్టిన కలగా ఉండేది. ఉద్యోగం చేసేటప్పుడు 2019 డిసెంబర్ లో ఒక ఆలోచన వచ్చింది. ఇన్వెస్టిగేషన్ డ్రామా అది. అయితే జాబ్, సినిమా రెండు ఛాలెంజ్. జాబ్ లో ఎంట్రీ లెవల్ లోనే ఉండేవాణ్ని. సినిమా కోసం ఒకసారి జాబ్ మానేసి నా భార్యను బాగా కష్టపెట్టా. ఆ తర్వాత అర్థమైంది జాబ్ మానేయడం ఇంపాజిబబుల్ అనుకున్నా. కొవిడ్ సమయంలో మా నాన్న అనారోగ్యం వల్ల ఉద్యోగం మానేయాల్సి వచ్చింది. ఓటీటీకి సూట్ అయ్యే కథతో తిరుగుతుండేవాణ్ని. * దివాన కథ జెమిని టీవీలో ఓ యాంకర్ ను చూసి రాసుకున్నా. ఆమె రోజూ టీవీలో వచ్చేంది. ఎంబీఏ పూర్తి చేశాక జాబ్ కోసం ప్రయత్నించకుండా సినిమా కోసం ఆగిపోయా. పొద్దున లేస్తే టీవీ చూస్తుండగా యాంకర్ కనిపించింది. వెళ్లి ఆ అమ్మాయిని కలిస్తే ఎట్లుండది, కలిస్తే ఏమవ్వొచ్చు, గుర్తుతెలియని వ్యక్తి వెళ్లి కలిస్తే ఏం జరుగుతుందనే ఆలోచన తట్టింది. దీంట్లో ఏమోషనల్ ప్లస్ కమర్షియల్ కథ ఉంది. ఇది రాయాలని అనుకున్నా. * నా దగ్గర ఏదీ ఉంటే దానిపై కథగా రాసుకునేవాణ్ని. నాకొచ్చి ఆలోచన మరిచిపోకముందే దాన్ని రాసుకోవాలనిపించేది. పేపర్ దొరక్కపోతే అగ్గిపెట్టె ముక్కపై కూడా రాసుకున్నా. ఒకసారి కథ పూర్తిగా వచ్చాక సిస్టమ్ పై కూర్చొని ఆ కథలోని పాత్రల గురించి రాసుకునేవాణ్ని. దాదాపు ఆరేడు నెలలు పట్టేది. అట్ల ఈ కథ 10 డ్రాఫ్ట్స్ వరకు రాశాను. మొదటి డ్రాఫ్ట్స్ 12 ఏళ్ల కిందటే రాశాను. * పెద్ద నిర్మాతలను కలిసే అవకాశం దొరకలేదు. చిన్న నిర్మాతలను కలిసి కథ చెప్పినప్పుడు వాళ్లేదో చెప్పేవాళ్లు. వాళ్లు మార్కెట్ లో ఉన్న నిర్మాతలు. వెర్షన్ అయితే రాలేదు. నేను రాసిన కథను పెద్ద కమర్షియల్ సినిమా చేయవచ్చని ఎవరూ ఊహించరు. అది నాకే తెలుసు. దాంట్లో



నేనేమో ఇంట్లో ఉండేవాణ్ని. వాళ్ల ఇన్ పుట్స్ తో కూడా మరింత డెవలప్ చేసేవాణ్ని. ఎవరికి కథ చెప్పినా ఆ మార్పులతో మరింత డెవలప్ చేసేవాణ్ని. రెండేళ్లలో టోటల్ గా కథ మొత్తం సెట్ అయిపోయింది. * రవీంద్రనాథ్ ఠాగూర్, ఆంటోన్ చెకావో రాసిన షార్ట్స్ స్టోరీల్లో కూడా ఇలాంటి లైన్స్ ఉంటాయి. దూరదర్శన్ లో కథా సాగర్ లో కూడా అద్భుతమైన కథలు వచ్చేవి. నా ఏమోషనల్ ఈజ్ ది బిగ్గెస్ట్ కమర్షియల్ ఆస్పెక్ట్. అంత ఏమోషన్ ఉంది. ఆ ఎమోషన్ చుట్టూ ఎంటర్ టైన్ మెంట్ ఉంది. నా కథలో హీరోది వన్ సైడ్ లవ్వే. ఎక్స్ట్రావర్ట్ గా హీరోయిన్ వెనుక పడుతుంటాడు. సెకండాఫ్ లో వన్ సైడ్ లవ్వే ఉంటుంది కానీ వెనుకపడేది ఉండదు. * నా ఫ్రెండ్స్ తో కలిసి అవకాశాల కోసం తిరిగేవాణ్ని. కొన్నాళ్ల తర్వాత ఎవరూ లేరు. నేను ఒక్కణ్నే మిగిలా. ఓ రోజు రామానాయుడు స్టూడియోలో షూటింగ్ జరుగుతుంది. అల్లు అరవింద్ గారు, సత్యనంద్ గారు ఉన్నారు. అప్పుడు నా కాలేజిలో అనుభవించిదంతా కథగా రాసుకున్నా. వాళ్లిద్దరు మాట్లాడుతుంటే వెళ్లి మీకు కథ చెప్పాలి సర్ అని అడిగా. వాళ్లు షాక్ అయ్యారు. గీతా ఆర్ట్స్ కు రాసా. కథ బాగుంటే సినిమా అవుతుంది. కథ బాగాలేకపోతే టీయో కాఫీయో వేస్ట్ అవుతదన్నారు. ఆఫీసుకు వెళ్తే నన్ను లోపలికి కూడా రానివ్వలేదు. లోపల సర్ ఉన్నారో లేరో కూడా తెలియదు. కానీ ఎట్టకేలకు అల్లు అరవింద్ సర్ ముందు కాఫీ తాగటానికి 20 ఏళ్లు పట్టింది. కథ నచ్చింది. కాఫీ వేస్ట్ కాలేదు. కాలేజీ కథ కాదు. దివాన కథ చెప్పాను. * సినిమాలో ఆరు పాటలుంటాయి. మూడు ఫైట్లు ఉంటాయి. మీరు ఎంతైనా బడ్జెట్ ఇవ్వండి అన్నీ చేస్తా అని చెప్పా. నేను డెమో చేస్తే సినిమా కన్నా బాగుంటుంది. 5 వేల రూపాయలతో డెమో తీశా. 69 రోజుల్లో తీయాల్సింద కథ అని చెప్పగానే 30 రోజుల్లో తీయమని చెప్పారు. ఇంత కథను 30 రోజుల్లో తీయమంటున్నరు. ఎలా రా అని మా ఫ్రెండ్స్ ను అడిగా. ముందైతే సినిమా మొదలుపెడుతాం అన్నారు. 42 రోజులు అయ్యింది. ఇంకా ఐదారోజుల కంటెంట్ తీయలేదు. అంత కంటెంట్ ను వదులుకోవడం ఛాలెంజ్ గా అనిపించినా రైటింగ్ పవర్, నటీనటుల వల్ల బాగా తీయగలిగాను. * ఒక నిర్మాత కోటి రూపాయల్లో తీద్దామని చెప్పారు. ఆ నిర్మాతకు హర్షిత్ రెడ్డి పరిచయం. అప్పటికి మెయిల్ రాలేదు. మెయిల్ డైరెక్టర్ ఉదయ్ నా ఫ్రెండ్. తనతో చెప్పించా. ఫైనల్ గా హర్షిత్ వచ్చి కథ విన్నడు. ఇది కొంచెం 90నాటి లవ్ స్టోరీలా అనిపిస్తుంది. నేను ఎలా ఉంటనో అలానే తీశా. ప్రతి మనిషిని టార్గెట్ చేసి తీసిన సినిమా దివాన. లవ్, ఫ్యామిలీ, ఫ్రెండ్స్ ఎమోషన్స్ బాగా నచ్చుతాయి. * సినిమా వచ్చిందో లేదో తెలియడం కన్నా...నెగిటివ్ కామెంట్స్ ఏమైనా వస్తున్నాయా అని చూస్తుంటా. ఏవరన్నా రియాక్ట్ అవుతున్నారా లేదో చూస్తా. నా సినిమా చూసి తిట్టుకున్నా హ్యాపీ. వాళ్ల రియాక్షన్ నాకు ఇంపార్టెంట్. ఫేక్ కామెంట్స్ చూస్తే చాలా కోపం వస్తుంది. * సినిమా ఇండస్ట్రీ చాలా విచిత్రంగా ఉంటుంది. చాలా మంది మ్యూజిక్ డైరెక్టర్లు, రైటర్లు డైరెక్టర్ల కంటే టాలెంట్ గా ఉంటారు. మనమే టాలెంట్ అనుకుంటే వాళ్లు మనకంటే జీనియస్. తరుణ్ భాస్కర్, త్రివిక్రమ్ లాంటి వాళ్లు. మ్యూజిక్ డైరెక్టర్ ఈశ్వర్ నేను కలిసి సినిమాలకు వెళ్లేవాళ్లం. ఈశ్వర్ సొంతగా నేర్చుకునేవాడు. నా కథలు ఈశ్వర్ కు చెప్పేవాణ్ని. అరవింద్ సర్ ఒకే అన్నాక అప్పుడు చెప్పా. బాగా రాశావు అన్నాడు. డెమో కోసం మ్యూజిక్ చేయిస్తే చెత్తగా చేశాడు. తిట్టా. ఒకసారి పక్కకు వెళ్లని చెప్పి మళ్లీ మ్యూజిక్ కొట్టాడు. అద్భుతంగా వచ్చింది. అరవింద్ సర్ టీమ్ కూడా బాగా నచ్చింది. కాపీ కొట్టాడా, ఇన్స్పిరేషన్ అనేది వాళ్లకు తెలియదు కదా. మన బడ్జెట్ లో డెమోకు మనోడు తప్ప ఇంకా ఎవరు రారు. ఇక సినిమాకు పాటలు చేయడం మొదలుపెట్టాం. చాలా రోజుల తర్వాత ఈశ్వర్ పాటలను ఒకే చేశారు. * తీయడానికి మన టాలెంట్ సరిపోతుందా అనే కథలున్నాయి నా దగ్గర. టెక్నికల్ గా, ఫ్యూచరిస్ట్ గా ఉంటాయి. కొన్ని సినిమాలు చేస్తూ ఆ టాలెంట్ ను సంపాదించుకోవాలి. అప్పుడే అవి తెరపైకి వస్తాయి.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 68-5-1/1,Near Municipal Complex , Patamata,N.T.R , Andhra Pradesh-520010 .Editor : Sudheer kumar katepally ph: 9000657700, PRGI NO: APTEL/26/A2264